# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 8-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:187 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

గాసిని దొలగించ గలుగు
బాసర దేవాలయమును భక్తుల కొరకై
భాసురముగ మలచుటకై
చేసెను రేవంతరెడ్డి చిత్రకటనమున్ !! ?

(రెండు వందల ఇరవై అయిదు కోట్లు కేటాయించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసరలో దేవాలయ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

ఏకరూప పౌరస్మృతి
ఎన్నికల ఎజెండా
మిగిలుందని ప్రధాని
మళ్లీ చేసే ప్రపగండా.
అమలుచేస్తే అందరికి
అవుతుందా ప్రమోదం
బహుళత్వం సంస్కృతిని
బలిచేసే ప్రమాదం



-వేల్పుల నారాయణ
9440433475

# తెలంగాణ అభివృద్ధి మోడల్ కేరళలో అమలు చేస్తాం: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 7:కేరళంలో పంచాయతీరాజ్ వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హయాంలో సీఎంలుగా పనిచేసిన కరుణాకరన్, ఊమెన్ చాందీలు కేరళంను ఎంతగానో అభివృద్ధి చేశారని ప్రస్తావించారు. ఈరోజు(మంగళవారం) కేరళంలోని కోవలం యూడీఎఫ్ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. కేరళంలో పంచాయతీరాజ్ వ్యవస్థ విజయం సాధించిందని.. దానిని తాము అభినందిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఎక్కడైనా మంచి జరిగితే తాము అభినందిస్తామని తెలిపారు. సీఎం పినరాయి విజయన్ హయాంలోని వైఫల్యాలను తాము ఎత్తి చూపామన్నారు. పినరాయి విజయన్ హయాం ముగిసిందని.. 120 నెలల విజయన్ పాలన కాలం వైఫల్యానికి ప్రతీకగా నిలిచిందని విమర్శించారు.

## మేము గెలవబోతున్నాం..

పినరాయి విజయన్ వైదొలిగే సమయం ఆసన్నమైందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మూడింట రెండొంతుల మెజారిటీతో తాము గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కేరళంలో ఊమెన్‌చాందీ తరహా పాలన అందిస్తామని స్పష్టం చేశారు. కేరళంలో సరైన అవకాశాలు లేకపోవడంతో యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్లారని చెప్పుకొచ్చారు. యువత వలస వెళ్లడంతో కేరళంలో వృద్ధులు... చిన్నపిల్లలే కనిపిస్తున్నారని ఇది దురదృష్టకరమని అన్నారు. విద్యావంతులు, నైపుణ్యం ఉన్న యువత విదేశాలకు వెళ్లడం సరికాదని.. వాళ్లు ఇక్కడకు వచ్చి ఉపాధి పొందేలా చేస్తామని తెలిపారు. తెలంగాణలో మాదిరే అభివృద్ధి.. మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ నియామకాలు... స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం వంటివి కేరళంలో అమలు చేస్తామని మాటిచ్చారు.

## మా సవాళ్లకు విజయన్ సమాధానం ఇవ్వాలి..

పినరాయి విజయన్‌తో పాటు కేరళం కమ్యూనిస్టు మహిళా నాయకులను తాను తెలంగాణకు ఆహ్వానిస్తున్నానని.. వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు తాము చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

తెలంగాణలోని ఏ మూలకైనా వెళ్లి తాము అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారు పరిశీలించవచ్చని... ఈ విషయంలో తాను విజయన్‌కు సవాల్ విసురుతున్నానని అన్నారు. తాము 67 వేల ఉద్యోగాలు ఇచ్చామని... 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ. 20,670 కోట్ల రుణమాఫీ చేశామని స్పష్టం చేశారు. 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని.. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని.. రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని ప్రస్తావించారు. తాము హామీలన్నీ అమలు చేస్తున్నామని.. విజయన్ తెలంగాణకు వచ్చి అన్నీ పరిశీలించుకోవచ్చని సూచించారు. ఎన్నికలు కేరళం.. తెలంగాణ మధ్య కాదని.. యూడీఎఫ్.. ఎల్డీఎఫ్ మధ్యనే జరుగుతున్నాయని తెలిపారు. తాము ఏం చేస్తున్నామో అది చెబుతున్నామని.. తమ సవాళ్లకు విజయన్ సమాధానం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# మరికొన్ని నాగరికత అంతమైపోతుంది: ట్రంప్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:మరికొన్ని గంటల్లో ఇరాన్‌కు విధించిన డెడ్‌లైన్ ముగియనున్న నేపథ్యంలో యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మునుపెన్నడూ చూడని స్థాయిలో వార్నింగ్ ఇచ్చారు. ఈ రాత్రి ఒక నాగరికత అంతమైపోవచ్చంటూ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో సంచలన కామెంట్ చేశారు. 'నేటి రాత్రి ఒక నాగరికత మొత్తం అంతమైపోతుంది. ఇక మరెన్నడూ అది కనిపించదు. ఇలా జరగాలని నేను కోరుకోవట్లేదు. కానీ ఇది జరగక తప్పేలా లేదు' అంటూ పోస్టు పెట్టారు.

తదుపరి జరిగేదేంటో చెప్పలేమని కూడా తన పోస్టులో నర్మగర్భంగా రాసుకొచ్చారు. ఇరాన్‌లో ఇప్పటికే పాలన మారింది కాబట్టి పాలకుల నుంచి మంచి నిర్ణయాలు రావొచ్చని కూడా పేర్కొన్నారు. 'అసలు ఏం జరగనుందో ఈ రాత్రి తెలిపోతుంది. సంక్లిష్టమైన, సుదీర్ఘమైన ప్రపంచ చరిత్రలో ఇవి అత్యంత ముఖ్యమైన క్షణాలు. 47 ఏళ్ల వేధింపులు, అవినీతి, మరణాలు నేటితో ముగుస్తాయి. ఇరాన్ ప్రజలకు ఆ దేవుడు అండగా ఉండాలి' అని ట్రంప్ తన పోస్టులో రాసుకొచ్చారు. దీంతో, ట్రంప్ ఏ నిర్ణయం తీసుకోబోతున్నారో తెలియక సర్వత్రా కలకలం రేగుతోంది.

# ఇరాన్ అప్రమత్తం.. విద్యుత్ ప్లాంట్ల చుట్టూ యువత మానవ హారాలు!



న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్దేశించిన గడువు సమీపిస్తున్న తరుణంలో ఇరాన్ అప్రమత్తమైనట్టు తెలుస్తోంది. ఆ దేశంలోని విద్యుత్ ప్లాంట్లు, బ్రిడ్జ్‌లపై భీకరదాడులు చేస్తామని ట్రంప్ ఇప్పటికే హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కీలక విద్యుత్ కేంద్రాల చుట్టూ క్రీడాకారులు, కళాకారులు, విద్యార్థులు సహా యువత అంతా మానవహారాలు ఏర్పాటుచేయాలని ఇరాన్ పిలుపునిచ్చినట్టు సమాచారం. దీంతో యువత పెద్దఎత్తున స్పందిస్తూ ఐక్యతను చాటుకుంటోంది.

అయితే.. ఈ ఆలోచన యువత నుంచే వచ్చిందని ఇరాన్ యువజన వ్యవహారాల ఉప మంత్రి అలిరెజా రహీమీ వెల్లడించారు. 'యువతే స్వయంగా ఈ రకమైన సూచన చేశారు. కొందరు విశ్వవిద్యాలయాల విద్యార్థులు, యువ కళాకారులు, యువజన సంస్థలు దేశంలోని విద్యుత్ కేంద్రాల చుట్టూ మానవ వలయంలా ఏర్పాటు చేద్దామని ప్రతిపాదించారు' అని రహీమీ చెప్పారు. ఈ నిర్ణయం.. దేశ మౌలిక వసతులను రక్షించడం సహా యువత నిబద్ధతకు, వారి భవిష్యత్తు నిర్మాణానికి సంకేతంగా నిలుస్తుందని ఆశిస్తున్నామని ఆయన అన్నారు.

కాగా.. హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు మంగళవారం రాత్రి(స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 3:30 గంటలకు) వరకు గడువు విధించారు ట్రంప్. ఈ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించకపోతే కఠినమైన సైనిక చర్యలు తీసుకుంటామని.. మౌలిక వసతులపై దాడులు కొనసాగిస్తామని హెచ్చరించారు. దీంతో డెడ్‌లైన్ ముగిసిన అనంతరం.. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు దాడులను తీవ్రతరం చేసే అవకాశముంది.

# మళ్లీ అధికారంలోకి రావాలంటే.. సైనికుల్లా పని చేయాలి: టీపీసీసీ చీఫ్

నాగర్ కర్నూల్, ఏప్రిల్ 07: తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. మంగళవారం నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేదలకు చేసింది ఏమి లేదన్నారు. అలాంటి పార్టీ రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీ గుండెకాయ గ్రామాల్లో ఉందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గ్రామాల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండంటూ కేడర్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా పని చేసే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. పార్టీలో అందరికీ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి.. లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ.. తన పాదయాత్రలో అన్ని విషయాలను తెలుసుకున్నారని వివరించారు. అందుకే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేశామని టీ పీసీసీ చీఫ్ చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందన్నారు. పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ఇచ్చిన మాట ప్రకారం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చాం అని గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో ఎన్ని నిధులు ఇచ్చారు ఎన్ని నియామకాలు చేశారు అంటూ ఆ పార్టీ నేతలకు టీ పీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నలు సంధించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి పోయిందని.. ఆ అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం తీరుస్తుందని ఆయన తెలిపారు. ఇచ్చిన హామీలను సైతం కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుకుంటూ ముందుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేశ్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సావర్కర్, కార్యదర్శి వంశీ చంద్ రెడ్డితోపాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల బస్సును ఢీకొన్న లారీ.. త్రుటిలో తప్పిన పెను ప్రమాదం..

ఖమ్మం, ఏప్రిల్ 7: ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఓ ప్రైవేటు పాఠశాల బస్సును వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 20 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 10 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తూ ప్రాణాపాయం తప్పడంతో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన విద్యార్థులను బస్సు నుంచి బయటకు తీశారు. ఈ ఘటనపై పోలీసులకు స్థానికులు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వేగంగా సహాయక చర్యలు చేపట్టారు. విద్యార్థులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నట్లు సమాచారం.

పోలీసుల దర్యాప్తు..

ఘటనా స్థలానికి చేరుకున్న ఖమ్మం రూరల్ పోలీసులు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, లారీని స్వాధీనం చేసుకుని తదుపరి దర్యాప్తు జరుపుతున్నారు. పాఠశాల వాహనాల డ్రైవర్లు, భారీ వాహనాల డ్రైవర్లు రద్దీ ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు: డీజీపీ శివధర్ రెడ్డి

ములుగు, ఏప్రిల్ 7 : అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, రోడ్ సేఫ్టీ అన్నిటికన్నా ముఖ్యమని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. సురక్షిత డ్రైవింగే అన్ని విధాలుగా మేలని పేర్కొన్నారు. ఈరోజు(మంగళవారం) వెంకటాపురం మండల కేంద్రంలో అరీవ్ అలైవ్ కార్యక్రమానికి డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ చీఫ్ సుమతి హాజరయ్యారు. ఈ సందర్భంగా రహదారి భద్రత రూల్స్ పాటిస్తామని ప్రమాణం చేయించారు.

అనంతరం డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపొద్దని వాహనదారులకు సూచించారు. కారు బెల్ట్ పెట్టకోకుండా డ్రైవింగ్ చేయొద్దని అన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రాణం మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. హెల్మెట్ లేకపోవడం వల్లే 75 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని.. 18 ఏళ్ల నుంచి 40 సంవత్సరాల వారే ఈ ప్రమాదాల బారిన పడుతున్నారని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

అంతకుముందు ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలం పామునూరు అటవీ ప్రాంతంలో పోలీస్ ఔట్ పోస్ట్, ఇంటలిజెన్స్ కో ఆర్డినేషన్ సెంటర్‌ను డీజీపీ శివధర్ రెడ్డి, ఐబీ చీఫ్ సుమతి, ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ, సీఆర్పీఎఫ్ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడారు. కర్రెగుట్టల్లో రోడ్లు వేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. అభివృద్ధి జరగాలంటే రోడ్ల నిర్మాణం జరగాలని చెప్పుకొచ్చారు. కొన్ని కారణాల వల్ల ఇక్కడ అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఇంత త్వరగా రోడ్లు వేయడం అభినందనీయమని అన్నారు. రోడ్లు వేయడంతోనే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు.

# యుద్ధంవల్ల పశ్చిమాసియాకు 10 వేల విమాన సర్వీసులు రద్దు : కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. అయితే ఈ ఉద్రిక్తతలు మొదలైనప్పటి నుంచి భారత విమానయాన సంస్థలు పశ్చిమాసియాకు విమాన సర్వీసులను రద్దు చేస్తూ వస్తున్నాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం భారత్ నుంచి పశ్చిమాసియాకు మొత్తం 10 వేల విమాన సర్వీసులు రద్దయినట్లు పౌరవిమానయాన శాఖ వెల్లడించింది.

యుద్ధానికి ముందు భారత్ నుంచి పశ్చిమాసియాకు రోజుకు 300 నుంచి 350 వరకు విమాన సర్వీసులు నడిచేవి. ఘర్షణల కారణంగా ఆ సంఖ్య ఇప్పుడు 80-90కి పడిపోయిందని పౌరవిమానయాన శాఖ తెలిపింది. ఇదిలావుంటే సుదూర విమాన ప్రయాణాలకు సంబంధించి పైలట్ల 'ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్' ను డీజీసీఏ తాత్కాలికంగా నడలించింది. విమాన కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకునేందుకే డీజీసీఏ ఈ నిర్ణయం తీసుకుందని ఏవియేషన్ మినిస్ట్రీ వెల్లడించింది

# ఇంటిపై రాకెట్ దాడి.. ఇద్దరు చిన్నారులు మృతి.. మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:ఈశాన్య రాష్ట్రం మణిపూర్ మరోసారి హింసాత్మకంగా మారింది. గుర్తు తెలియని దుండగులు జరిపిన రాకెట్ దాడి కారణంగా ఇద్దరు చిన్నారులు మరణించగా, వారి తల్లి గాయపడింది. దీంతో ఘటన జరిగిన బిష్ణుపూర్ జిల్లాలో ఆందోళనలు చెలరేగాయి. ఈ కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో అధికారులు ఇంటర్నెట్ బంద్ చేశారు. పలు చోట్ల కర్ఫ్యూ విధించారు. మణిపూర్‌లో కొన్నేళ్లుగా మైతీ, కుకీ తెగల మధ్య ఘర్షణ ఉన్న సంగతి తెలిసిందే.

గతంలో ఘర్షణలు జరిగిన ప్రాంతాల్లో బిష్ణుపూర్ జిల్లా కూడా ఒకటి. ఈ జిల్లాలోని మోయిరంగ్ ప్రాంతంలోని ట్రోంగ్లాబి అవాంగ్ లైకై అనే గ్రామంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత ఒక ఇంటిపై కొందరు దుండుగులు రాకెట్ దాడి చేశారు. ఈ దాడిలో ఇంట్లో నిద్రిస్తున్న ఇద్దరు పిల్లలు మరణించారు. వారి తల్లి గాయపడ్డారు. మృతుల్లో ఐదేళ్ల బాలుడు, ఆరు నెలల పాప ఉంది. ఈ దాడి ఘటనతో మరోసారి ఈ ప్రాంతంలో ఉద్రిక్తత తలెత్తింది. స్థానికులు భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. దగ్గర్లోని ఆయిల్ ట్యాంకులు, ట్రక్కులు తగలబెట్టారు. ఆస్తులు ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు, భద్రతా దళాలు అక్కడికి చేరుకుని శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో భద్రతా బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనలో 19 వరకు గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ ఘర్షణలు మరింత చెలరేగకుండా అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

తప్పుడు సమాచారం వ్యాపించకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా బిష్ణుపూర్‌తోపాటు మరో నాలుగు జిల్లాల్లో ఇంటర్నెట్ బంద్ చేశారు. కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. ఈ ఘటనను మణిపూర్ సీఎం వై ఖేంచంద్ సింగ్ ఖండించారు. ఇంటిపై రాకెట్‌తో దాడి చేయడాన్ని తీవ్రవాద చర్యగా అభివర్ణించారు. మరోవైపు కుకీ తెగల వాళ్లే ఈ దాడి చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# మీడియా సంస్థలపై వైసీపీ నేతల బెదిరింపు ధోరణి సరికాదు: రామచందర్ రావు

హైదరాబాద్, ఏప్రిల్ 7:ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల మీద వైసీపీ నేతలు చేసిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పేర్కొన్నారు. ప్రజస్వామ్యంలో మీడియాపై దాడులు చేయడం సరైన పద్ధతికాదన్నారు.

ఈరోజు(మంగళవారం) ఆయన ఏబీఎన్‌తో మాట్లాడారు. గతంలో కేసీఆర్ హయాంలో ఉన్నప్పుడు ఇదే తరహా దాడులు చేసేవారని ప్రస్తావించారు. రాజకీయ విమర్శలు ఉంటే రాజకీయంగా చూసుకోవాలని.. బెదిరింపు ధోరణి సరికాదన్నారు. బాధ్యతాయుతమైన ఏబీఎన్ లాంటి సంస్థపై వైసీపీ నేతలు చేసిన దాడిని ఖండిస్తున్నామని రామచందర్ రావు పేర్కొన్నారు.

# ఫేక్ ప్రిడిక్షన్‌లను నమ్మొద్దు.. జాగ్రత్త: సీపీ సజ్జనార్

హైదరాబాద్, ఏప్రిల్ 7: ఐపీఎల్ మ్యాచ్‌ల పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు పెరిగిపోతున్నాయని... ఈ ఉచ్చులో పడవద్దని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక జారీ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సీపీ స్పందించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ క్రికెట్ ప్రిడిక్షన్ ఛానెల్స్ దందా చేస్తున్నాయని.. టాస్, మ్యాచ్ ఫలితాలు ముందే చెబుతామని అమాయకులను బెట్టింగ్ ఉచ్చులోకి లాగుతూ మోసం చేస్తున్నాయని సీపీ తెలిపారు. ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా ఈ అసత్య ప్రచారాల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ ఫేక్ ప్రిడిక్షన్ ఛానెల్స్.. ముందుగా ఎన్‌రోల్ చేయించి, తర్వాత బెట్టింగ్ యాప్‌ల లింకులు పంపి మోసం చేస్తున్నాయని సజ్జనార్ అన్నారు. బెట్టింగ్ వల్ల కష్టపడి సంపాదించిన డబ్బును అమాయకులు కోల్పోతున్నారని ఆయన చెప్పారు. ఫేక్ ప్రిడిక్షన్ లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని సీపీ హెచ్చరించారు. ఫేక్ ప్రిడిక్షన్‌లు, బెట్టింగ్‌లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం కఠిన చర్యలు తీసుకుంటుందని సీపీ తెలిపారు.

ఇప్పటివరకు 494 పెయిడ్ యాడ్స్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు బ్లాక్ చేశారని సీపీ చెప్పారు. సోషల్ మీడియాలో 129 ఫేక్ ప్రొఫైళ్లను తొలగించారన్నారు. బెట్టింగ్ యాప్‌లపై నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. మోసపూరిత యాడ్స్ కనిపిస్తే వెంటనే రిపోర్ట్ చేయాలని ప్రజలను సీపీ కోరారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930కి ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.in ని వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# నాగరికతను అంతం చేస్తామన్న ట్రంప్.. గట్టి వార్నింగ్ ఇచ్చిన ఇరాన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:నేటి రాత్రి ఒక నాగరికత అంతమైపోవచ్చంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన వార్నింగ్‌పై ఇరాన్ అదే స్థాయిలో బదులిచ్చింది. అమెరికా, దాని మిత్రదేశాలను ప్రాచీన ఇరాన్ నాగరికత ఎన్నడూ మర్చిపోలేని విధంగా దెబ్బకొడుతుందని తీవ్రస్థాయిలో బదులిచ్చింది. ఈ మేరకు దక్షిణాఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ ఓ పోస్టు పెట్టింది.

నేటి రాత్రి ఇరాన్ నాగరికత అంతమైపోవచ్చని డొనాల్డ్ ట్రంప్ తాజాగా హెచ్చరికలు చేసిన విషయం తెలిసిందే. ప్రపంచ చరిత్రలో ఇవి అత్యంత ముఖ్యమైన క్షణాలని అన్నారు. 47 ఏళ్లుగా సాగిన అరాచకాలకు ముగింపు పడనుందని కూడా చెప్పారు. లేదా ఇరాన్ పాలకుల నుంచి మంచి నిర్ణయం వెలువడవచ్చని కూడా వ్యాఖ్యానించారు. దీంతో, ట్రంప్ మనసులో ఏముందన్న అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ట్రంప్ వ్యాఖ్యలకు తుర్కియేలోని ఇరాన్ ఎంబసీ మరింత ఘాటుగా బదులిచ్చింది. సైకో హెచ్చరికలను లెక్కచేయబోమని పేర్కొంది. చరిత్రలో ఎన్ని దాడులు జరిగినా ఇరాన్ నాగరికత ఇప్పటికీ నిలిచే ఉందని పేర్కొంది. 'అలెగ్జాండర్ ఈ నాగరికతను తగలబెట్టాడు. మంగోలులు దోచుకున్నారు. కాలం ఎన్నో పరీక్షలు పెట్టింది. ఇరాన్ ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. కాలానికే ఎదురు నిలిచిన ఇరాన్ నాగరికతను సైకో హెచ్చరికలు ముగించలేవు' అని ఇరాన్ ఎంబసీ పేర్కొంది.

ఇక ఇరాన్‌లో మౌలిక వసతులను టార్గెట్ చేస్తామని ట్రంప్ పేర్కొనడంపై ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ అభ్యంతరం చెప్పారు. పౌర వసతులపై దాడులు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని అన్నారు. ప్రతిపాదిత కాల్పుల విరమణ తమకు అంగీకారం కాదని ఇరాన్ ఇప్పటికే స్పష్టం చేసింది. యుద్ధానికి శాశ్వతంగా ముగింపు పలకాలని, మళ్లీ దాడులు జరగవన్న హామీ కావాలని పట్టుబడుతోంది.

# జంతు ప్రదర్శనశాలలు అంతరించే జంతువుల పరిచయాలు !

## (08 ఏప్రిల్ "జాతీయ జూ ప్రేమికుల దినోత్సవం" సందర్భంగా)

సాధారణ జంతువులతో పాటు అరుదైన, అంతరించే స్థితిలో ఉన్న జంతువులను సహితం పరిచయం చేసే కేంద్రాలను జంతు ప్రదర్శనశాల 'జూ' లేదా 'జులాజికల్ గార్డెన్' అని పిలుస్తున్నాం. మనం చూడడానికి వీలు కాని అటవీ జంతువులను మన కళ్ల ముందుకు చేర్చే గురుతర బాధ్యతలను 'జూ'లు తీసుకుంటున్నాయి. అంతరించే జంతుజాతులను సంతానోత్పత్తి ద్వారా కాపాడడం, ప్రజలకు జంతువుల జీవ వ్యవస్థలను పరిచయం చేయడం, జీవ వైవిధ్య ప్రాధాన్యాన్ని వివరించడం, జంతువుల పరిరక్షణ ప్రాధాన్యాన్ని అవగాహన పర్చడం, జంతు విజ్ఞానాన్ని పొందడం, వినోదాలను పంచే కేంద్రాలుగా 'జూ'లు సేవలు అందించడం, పిల్లలు పెద్దలకు వివిధ రకాల జంతువులు వీనుల విందులు వడ్డించడం జరుగుతున్నది. ప్రతి ఏట మిలియన్ల ప్రజలు/ పిల్లలు జంతుప్రదర్శనశాలలను సందర్శించడం కొనసాగుతున్నది.

### ప్రపంచవ్యాప్తంగా జంతుప్రదర్శనశాలలు:

ప్రపంచవ్యాప్తంగా 10,000 లకు పైగా జంతుప్రదర్శనశాలలు ఉండగా, అత్యధికంగా అమెరికాలో 350, జర్మనీలో 316, యూకెలో 118, ఆస్ట్రేలియాలో 104, జపాన్‌లో 96, బ్రెజిల్‌లో 80, భారత్‌లో 66 గుర్తింపు పొందిన 'జూ'లు ఉన్నాయి. భారత కేంద్ర జూ అథారిటీ గుర్తించిన 347 'జూ'లు ఉండగా, అందులో 164 మాత్రమే అధికారికంగా పేరును పొందాయి. భారత్‌ని కర్నాటకలో 14, పశ్చిమ బెంగాల్‌లో 13, మహారాష్ట్రలో 12, తమిళనాడులో 10, గుజరాత్‌లో 10 'జూ'లు ఉన్నాయి. తెలంగాణలో 07 (బసంత్‌నగర్, శామీర్‌పేట, వరంగల్, కరీంనగర్, కిన్నెరసాని, హైదరాబాదు, పిల్లలమర్రి) 'జూ'లు ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 05 (చిత్తూర్, కండలేరు, వైజాగ్, అనంతపూర్, తిరుపతి) మాత్రమే ఉన్నాయి.

### 'జూ'ల గత చరిత్ర :

1752లో వియన్నాలో జంతుప్రదర్శనశాలల చరిత్ర ప్రారంభమైనది. ప్రజల సందర్శనకా అనుమతించిన తొలి 'జూ'గా 1793లో ప్యారిస్‌లో, శాస్త్రీయ పరిశోధనలకు ఉద్దేశించిన 'జూ'గా 1828లో లండన్‌లో జంతుప్రదర్శనశాల ప్రారంభమైంది. తొలి అమెరికా 'జూ'ను 1974లో ఫిలడెల్ఫియాలో ప్రారంభించారు. 1962లో ఏర్పడిన ప్రపంచ జూ మరియు అక్వేరియం అసోసియేషన్ చొరవతో 'జూ'ల సంస్కృతి మొదలయ్యింది. వివిధ రకాల 'జూ'లలో సఫారీ పార్కులు, ఆనిమల్ థీమ్ పార్కులు, ఎవియరీస్, బట్టర్‌ప్లై జూలు, రెప్టైల్ జూలు, వైల్డ్‌లైఫ్ సాంచరీస్, సహజ నిల్వలు లేదా రిజర్వ్‌లు ఉన్నాయి. అరిగ్నర్ అన్నా జూను తొలి భారత జంతుప్రదర్శనశాల, చెన్నైని 1855లో గుర్తించారు. తెలుగు రాష్ట్రాల్లో నెహ్రూ జూ పార్క్-హైదరాబాదు, ఇందిర గాంధీ జూ పార్క్ విశాఖపట్నం, కాకతీయ జూ పార్క్ వరంగల్, శ్రీ వెంకటేశ్వర జూ పార్క్ తిరుపతి లాంటివని కొన్ని ప్రధాన 'జూ'లోగా పేరొందాయి.

### జాతీయ జూ ప్రేమికుల దినం-2026:

వివిధ అరుదైన జంతువులను ప్రజల సందర్శనార్థం మన ముందుకు చేర్చిన జంతుప్రదర్శనశాలలను ప్రస్తుతిస్తూ 2002 నుంచి ప్రతి ఏట 08 ఏప్రిల్‌న "జాతీయ జంతుప్రదర్శనశాల ప్రేమికుల దినం" లేదా "నేషనల్ జూ లవర్స్ డే"ను పాటించుట ఆనవాయితీగా మారింది. జంతు ప్రేమికులు బాధ్యతగా చిన్న/ పెద్ద జంతు సంరక్షణలు బాగస్వామ్యం అవుతున్నారు. కొన్ని శతాబ్దాలుగా జంతుప్రదర్శనశాలలు మానవాళి మనుగడకు ప్రాశ్నార్థకం చేసాయి. అంతరించే దశలో అరుదైన జాతులుగా ఉన్న అమాయక అందమైన జంతువులు మనిషితో ముఖాముఖి నిలవడం అద్భుత అనుభవంగా నిలుస్తున్నది. జాతీయ జూ ప్రేమికుల దినోత్సవం సందర్భంగా "జంతువులతో సంబంధాలను కొనసాగిస్తూ వన్యప్రాణుల పరిరక్షణ చర్యలు తీసుకోవడం" లాంటి ఇతివృత్తాలను తీసుకోవడం కొనసాగుతోంది.

మనందరం మన సమీపాన ఉన్న 'జూ'లను స్నేహితులు, బంధువులతో కలిసి సందర్శించి మధుర జ్ఞాపకాలను మన హృదయంలో పదిల పరుచుకుందాం. 'జూ'లకు విరాళాలు అందించడం, పిల్లలను జూలకు తీసుకు వెళ్లడం, ఎన్నడూ చూడని, నేటి వరకు తెలియని జంతువులను చూసి మానసిక ఉల్లాస అపూర్వ అనుభవం పొందుదాం.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# గనుల లీజులో సమీప ప్రాంతాలను, అనుబంధ ఖనిజాలను చేర్చేందుకు మార్గం సుగమం చేస్తూ, ఖనిజ రాయితీ నిబంధనల్లో సవరణలను ప్రకటించిన గనుల మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:అణు, హైడ్రో కార్బన్ ఇంధన ఖనిజాలు మినహా ఇతర ఖనిజాల రాయితీ (రెండవ సవరణ) నిబంధనలు - 2026ను గనుల మంత్రిత్వ శాఖ 2026 మార్చి 30న నోటిఫై చేసింది. ఈ సవరణల ద్వారా భూమి లోతులో ఉండే ఖనిజాల కోసం మైనింగ్ లీజ్, కంపోజిట్ లైసెన్స్‌లో సమీప ప్రాంతాలను చేర్చేందుకు, అలాగే భారీ, చిన్న తరహా ఖనిజాల మైనింగ్ లీజుల్లో అనుబంధ ఖనిజాలను చేర్చేందుకు సమగ్ర విధానాన్ని అందించారు.

గనుల,ఖనిజాల (అభివృద్ధి - నియంత్రణ) చట్టం, 1957 (ఎంఎండిఆర్) కు చేసిన సవరణలకు అనుగుణంగా ఈ నిబంధనలలో మార్పులు చేశారు. ఎంఎండిఆర్ సవరణ చట్టం, 2025 ద్వారా తీసుకువచ్చిన ఈ మార్పులు సెప్టెంబర్ 1, 2025 నుంచి అమలులోకి వచ్చాయి. దేశానికి అవసరమైన కీలక ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తిని పెంచడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ సవరణ ద్వారా తీసుకొచ్చిన సంస్కరణలు పరిశ్రమలకు ఖనిజాల సరఫరాను పెంచడానికి గనుల రంగానికి ఊతమిస్తాయి. తద్వారా ఆత్మనిర్భర్ భారత్ ను బలోపేతం చేస్తాయి.

సవరించిన నిబంధనలు మైనింగ్ లీజు, లేదా లోతుల్లోని (డీప్-సీటెడ్) ఖనిజాల కాంపోజిట్ లైసెన్స్ కలిగిన వారు తమ లీజు ప్రాంతాన్ని పక్కనే ఉన్న భూభాగంతో ఒకేసారి పొడిగించుకోవడానికి సమర్పించే దరఖాస్తులను ప్రాసెస్ చేయడానికి సరళమైన, గడువు ఆధారిత విధానాన్ని. అందిస్తాయి. మైనింగ్ లీజు విషయంలో ఈ అదనపు ప్రాంతం ప్రస్తుతం ఉన్న లీజు విస్తీర్ణంలో 10% మించకూడదు, అలాగే కాంపోజిట్ లైసెన్స్ (విషయంలో ఇది ప్రస్తుతం ఉన్న విస్తీర్ణంలో 30% మించకూడదు వేలం ద్వారా పొందిన మైనింగ్ లీజు లేదా కాంపోజిట్ లైసెన్స్‌కు పక్కనే ఉన్న ప్రాంతాన్ని అదనంగా కలిపినట్లయితే, ఆ అదనపు ప్రాంతం నుంచి తరలించే ఖనిజాలపై లీజుదారుడు వేలం ప్రీమియంలో 10% చెల్లించాలి. ఒకవేళ లీజును వేలం లేకుండానే మంజూరు చేసినట్లయితే, ఆ అదనపు ప్రాంతం నుంచి తరలించే ఖనిజాలపై రాయల్టీతో సమానమైన అదనపు మొత్తాన్ని లీజుదారుడు చెల్లించాల్సి ఉంటుంది.

పక్కనే ఉన్న ప్రాంతాల్లో విస్తరించి ఉండి, విడిగా వేరే లీజు లేదా లైసెన్స్ కింద తవ్వకాలు జరపడానికి ఆర్థికంగా లాభదాయకం కాని ప్రాంతాలను చేర్చడానికి అనుమతించడం వల్ల, భూగర్భంలో లోతుగా ఉండే ఖనిజాల తవ్వకం మెరుగుపడుతుంది.

ఈ నిబంధనలు మైనింగ్ లీజులో ఇతర ఏ ఖనిజాన్నైనా, చిన్న (మైనర్) ఖనిజాలను కూడా చేర్చే విధానాన్ని నిర్దేశిస్తాయి. అలాగే, దరఖాస్తు చేసిన 30 రోజులలోపే ఆ చేర్పును అనుమతించడం రాష్ట్ర ప్రభుత్వానికి తప్పనిసరి చేస్తాయి ఎంఎండిఆర్ చట్టంలోని ఏడవ షెడ్యూల్‌లో పేర్కొన్న కీలకమైన, వ్యూహాత్మక ఖనిజాలను, భూగర్భ లోతుల్లోని ఖనిజాలను చేర్చడంపై ఎటువంటి అదనపు రుసుము వర్తించదు. తక్కువ పరిమాణంలో లభించే, తవ్వడానికి, శుద్ధి చేయడానికి కష్టతరమైన ఖనిజాల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి ఇది దోహదపడుతుంది.

ఎంఎండిఆర్ సవరణ చట్టం, 2025 అమలులోకి రాకముందు మంజూరు చేసిన చిన్న తరహా ఖనిజాల లీజుల్లో భారీ ఖనిజాలను చేర్చడానికి సంబంధించిన విధానాన్ని కూడా ఈ సవరణ వివరిస్తుంది. భవిష్యత్తులో మైనర్ ఖనిజాల లీజుల మంజూరు కోసం, ఇసుక మినహా ఇతర మైనర్ ఖనిజాల మైనింగ్ లీజులను ఆ ప్రాంతంలో జీ3 స్థాయి వరకు అన్వేషణ పూర్తయిన తర్వాతే మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ అన్వేషణలో ఆ ప్రాంతంలో ఏదైనా భారీ ఖనిజం ఉన్నట్లు గుర్తిస్తే, రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని మేజర్ మినరల్ బ్లాక్‌గా వేలం వేయాల్సి ఉంటుంది. గనుల తవ్వకాన్ని గరిష్ట స్థాయిలో సమర్థవంతంగా నిర్వహించడానికి ఇది మరొక ముఖ్యమైన అడుగు.

సొంత వినియోగం కోసం ప్రభుత్వం అనుమతించిన (క్యాప్టివ్) గనుల నుంచి ఖనిజాల విక్రయంపై ఉన్న పరిమితిని తొలగించడానికి, చట్టంలో చేసిన సవరణకు అనుగుణంగా సంబంధిత నిబంధనలను కూడా సవరించారు. గనులకు అనుసంధానించిన సొంత వినియోగ ప్లాంట్ (ఎండ్-యూజ్ ప్లాంట్లు) వాటి పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నప్పుడు, ఆ ప్లాంట్ల అవసరాలు తీరిన తర్వాత మిగిలిన ఖనిజాలను మైనింగ్ సంస్థలు అమ్ముకోవచ్చు ఒకవేళ సొంత వినియోగ ప్లాంట్ దాని పూర్తి సామర్థ్యం కంటే తక్కువ స్థాయిలో పనిచేస్తుంటే, ఆ ఆర్థిక సంవత్సరంలో ఆ ప్లాంట్‌లో వినియోగించిన ఖనిజ పరిమాణంతో సమానమైన మొత్తాన్ని మాత్రమే లీజుదారుడు విక్రయించవచ్చు. ఇది ఎంఎస్ఎమ్ ఈలతో సహా మార్కెట్‌లో ఖనిజాల లభ్యతను పెంచుతుంది.

సవరణ నిబంధనలలో పొందుపరిచిన ఈ సరళమైన విధానం, ఈ రంగంలో వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని పెంపొందించడమే కాకుండా, కీలకమైన, వ్యూహాత్మక, లోతైన ఖనిజాల ఉత్పత్తి పెరుగుదలకు దోహద పడుతుంది అదే సమయంలో, అదనపు చెల్లింపులు, ఉత్పత్తి పెరగడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రయోజనం పొందుతాయి. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, పరిశ్రమల సంఘాలు, ఇతర వాటాదారులతో విస్తృతమైన సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ నిబంధనలను రూపొందించారు.

## రాజ్యసభకు కొత్తగా/ మళ్లీ ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన రాజ్యసభ ఛైర్మన్ శ్రీ సీపీ రాధాకృష్ణన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:కొత్తగా/ మరోసారి ఎన్నికైన పంతొమ్మిది మంది సభ్యులతో రాజ్యసభ ఛైర్మన్ శ్రీ సీపీ రాధాకృష్ణన్ రాజ్యసభ ఛాంబర్లో ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీ రాందాస్ బందు అథవాలే, శ్రీమతి మాయా చింతమన్ ఇవ్నతే, శ్రీ శరదచంద్ర పవార్, శ్రీ రామ్‌రావు శఖారాం వద్కుటే, డాక్టర్ జ్యోతి నాగనాథ్ వాఘ్‌మర్, శ్రీ క్రిస్టోఫర్ మాణి కం, డాక్టర్ అంబుమణి రాందాస్, శ్రీ కాన్స్టాండైన్ రవీంద్రన్, శ్రీ ఎల్ కే సుధీష్, డాక్టర్ ఎం తంబిదురై, శ్రీ తిరుచి శివ, శ్రీ బాబుల్ సుప్రియా బరాల్, డాక్టర్ మేనకా గురుస్వామి, శ్రీ రాజీవ్ కుమార్, రుక్మిణీ మల్లిక్, శ్రీ బిశ్వజిత్ సిన్హా, శ్రీ సంతృప్త్ మిశ్రా, శ్రీ దిలీప్ కుమార్ రే, శ్రీ మన్మోహన్ సమాల్ ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు.

ముగ్గురు సభ్యులు మరాఠీలో, ఇద్దరు హిందీలో, ఆరుగురు తమిళంలో, ఒకరు ఇంగ్లీషులో, నలుగురు బెంగాలీలో, ముగ్గురు ఒడియాలో ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో మహారాష్ట్ర నుంచి అయిదుగురు, తమిళనాడు నుంచి ఆరుగురు, పశ్చిమ బెంగాల్ నుంచి అయిదుగురు, ఒడిశా నుంచి ముగ్గురు ఉన్నారు.

పార్లమెంటరీ వ్యవహారాలు, మైనార్టీ వ్యవహారాల మంత్రి శ్రీ కిరణ్ రిజిజు, గిరిజన వ్యవహారాల మంత్రి శ్రీ జుయల్ ఓరం, రాజ్యసభ సెక్రటరీ జనరల్ శ్రీ పీసీ మోదీ ఇతర సచివాలయ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గ్యాస్ కొరతతో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి..



మచిలీపట్నం ఏప్రిల్ 7: కృష్ణాజిల్లా వ్యాప్తంగా సామాన్య ప్రజలకు వంట గ్యాస్ కొరతతో ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా వ్యవహరించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్ బాబుకు బీ.సీ సంక్షేమ సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రమణ్యం మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వంట గ్యాస్ డెలివరీ ఆలస్యం అవుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు.

గ్యాస్ డెలివరీ అయిన 30 రోజుల తర్వాత బుకింగ్ చేసుకున్న వారికి సైతం డెలివరీకి 10 నుంచి 15 రోజులు అవుతున్నప్పటికీ వంట గ్యాస్ అందడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు బుక్ చేసుకున్నప్పటికీ ఆలస్యం అవ్వడం ఏమిటని ప్రశ్నించారు. అంతేకాకుండా టోల్ ఫ్రీ నెంబర్లకు సంబంధిత సమస్యను తెలియపరచడానికి కాల్ చేసినప్పటికీ సరైన స్పందన లేకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు.

వంట గ్యాస్ డెలివరీ జాప్యం వల్ల ప్రజలు తమ పనులను మానుకుని ఎండలో బారులు తీరి గ్యాస్ కంపెనీల వద్ద పడుతున్న ఇబ్బంది వర్ణనాతీతమన్నారు. అలాగే కమర్షియల్ బండలను నిలిపివేసినప్పటికీ హోటలలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ బండలు దర్శనం ఇవ్వడం బాధాకరమన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కాబట్టి వంట గ్యాస్ సకాలంలో అందించడమే కాకుండా టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సరైన స్పష్టతను ప్రజలకు అందించి ఆదుకోవాలని బి.సి సంక్షేమ సంఘం తరపున డి.ఎస్.ఓ మోహన్ బాబు కు వినతి పత్రం సమర్పించినట్లుగా సుబ్రమణ్యం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జోగి శివ, భోగి రెడ్డి సుభాని, నిక్కు రాధాకృష్ణ, ఎన్. అన్సారి, బెల్లంకొండ రవి, పి.సాంబయ్య, చేబోయిన కోటయ్య తదితర బీ.సీ నాయకులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ఎమ్మెల్యే కొలికపూడి ధర్నా..

**-భూకబ్జాలపైఎమ్మెల్యే ఆగ్రహం..**
**-ఏ కొండూరు లో ఉద్రిక్తత**
**-10 రోజుల్లో సర్వే చేస్తామన్న అధికారుల హామీ**
**-ప్రభుత్వ స్థలాలను కాపాడాలి**
**-ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్**
**-కబ్జాదారులను వెంటనే ఖాళీ చేయించాలి**
**-పది రోజుల్లో సర్వే పూర్తి చేస్తాం**
**-ఎమ్మార్వో, పోలీసులు, ఇతర అధికారులు..**



విజయవాడ, ఏప్రిల్ 7:ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో జాతీయ రహదారి వెంట భూకబ్జాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ ఆందోళనకు దిగారు. స్థానికంగా జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించి కబ్జాదారులపై తీవ్రంగా స్పందించారు. జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాలు అక్రమంగా ఆక్రమణకు గురవుతున్నాయని పేర్కొంటూ, వెంటనే వాటిని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొలికపూడి డిమాండ్ చేశారు. కబ్జాదారులను ప్రభుత్వ భూముల నుంచి ఖాళీ చేయించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

ధర్నా విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఎమ్మెల్యేతో చర్చలు జరిపారు. ఎమ్మార్వో సహా రెవెన్యూ అధికారులు సమస్యను పరిశీలించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పది రోజుల్లో పూర్తి స్థాయి సర్వే నిర్వహించి భూసంబంధిత వివాదాలను క్లియర్ చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ నిరసనను విరమించారు. ఈ ఘటన స్థానికంగా భూకబ్జాల సమస్యపై మళ్లీ చర్చకు దారితీసింది. ప్రభుత్వ స్థలాల రక్షణపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

# 'మహిళా సంఘాల రుణాల్లో అక్రమాల నిగ్గు తేల్చాలి'

ఖమ్మం, ఏప్రిల్ 7: సింగరేణి మండలం విజేత మండల మహిళా సమాఖ్య పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇచ్చిన రుణాల్లో జరిగిన అక్రమాలపై నిగ్గు తేల్చాలని ఐద్వా ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు రమణ, బండి పద్మ, మండల కార్యదర్శి కొండబోయిన ఉమావతి డిమాండ్ చేశారు. గ్రామాల్లో డ్వాక్రా మహిళల సమస్యలపై ఐద్వా మంగళవారం సర్వే నిర్వహించింది.

డ్వాక్రా గ్రూపులో సభ్యులుగా ఉన్న మహిళలకు తెలియకుండానే స్త్రీనిధి, లింకేజీ రుణాలు రూ. లక్షలను విజేత మండల సమాఖ్యలోని వివిధ స్థాయి సిబ్బంది కాజేశారని సర్వేలో బాధిత మహిళలు తెలిపినట్లు ఐద్వా నేతలు తెలిపారు.

మొట్లగూడెంలో వినాయక్, స్వరాజ్ గ్రూపులతో పాటు ఇతర గ్రామాలలోని గ్రూపులో గ్రామంతో సంబంధం లేనివారి పేర్లను చేర్పించి, గ్రామ దీపిక(బుక్ కీపర్), వెలుగు సీసీ, సిబ్బంది, ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ లక్షల రూపాయల అవినీతి పాల్పడ్డట్టు తమ సర్వేలో మహిళలు తెలిపారన్నారు. రుణాలతో సంబంధం లేని మహిళల పేర్లతో బ్యాంకులో బకాయిలు ఉన్నాయని వాటిని చెల్లించాలని బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేసి వారిని ఒత్తిడికి గురి చేస్తున్నారని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.

అక్రమాలపై ఉన్నత అధికారులు విచారణ పేరుతో ఆఫీస్ చుట్టూ తిప్పుకోవడం తప్ప సమస్య పరిష్కారం కావటం లేదని వారు ఆరోపించారు.

సింగరేణి మండలంలో మహిళా స్వయం సహాయక సంఘాల రుణాలలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవటంలో జాప్యం జరుగుతుందని ఇది సహించరానిదని ఐద్వా నేతలు అన్నారు.

తప్పుడు గ్రూపును తయారు చేయడం, గ్రామానికి సంబంధం లేని సభ్యులను గ్రూపులో ఉంచటం, గ్రామ సమాఖ్య సభ్యులకు తెలియకుండా తీర్మానాలను చేయడం లాంటి అక్రమ చర్యలు స్పష్టంగా కనపడుతున్నా విచారణ, రికవరీలు పేరుతో అక్రమార్కులపై చర్యలకు కాలయాపన చేయడం సరికాదన్నారు.

జిల్లా పిడి, ఇతర జిల్లా అధికారులు వెంటనే స్పందించి అక్రమాలను అరికట్టాలన్నారు.

# ఆధ్యాత్మిక సేవలో అంబానీ వారసుడు.. గురువాయూర్, రాజరాజేశ్వరం ఆలయాలకు రూ.18 కోట్ల సాయం!



కేరళ, ఏప్రిల్ 7: రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ కేరళలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి, ఏనుగుల సంక్షేమానికి భారీ విరాళం ప్రకటించారు. పవిత్రమైన గురువాయూర్ మరియు రాజరాజేశ్వరం దేవాలయాలను సందర్శించిన ఆయన, మొత్తం 18 కోట్ల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా రెండు దేవాలయాలకు చెరో 3 కోట్ల రూపాయల చొప్పున మొత్తం 6 కోట్ల రూపాయలను తక్షణ విరాళంగా అందజేశారు. అలాగే చారిత్రక ప్రాధాన్యత కలిగిన రాజరాజేశ్వరం ఆలయ తూర్పు గోపుర పునరుద్ధరణ పనుల కోసం మరో 12 కోట్ల రూపాయలను కేటాయించాడు. దాదాపు రెండు శతాబ్దాలుగా శిథిలావస్థలో ఉన్న ఈ పురాతన గోపురాన్ని పునరుద్ధరించడం భక్తులకు మరియు ఆలయ అధికారులకు ఒక చారిత్రక ఘట్టంగా నిలవనుంది.

ఆలయ సందర్శనలో భాగంగా అనంత్ అంబానీ మాట్లాడుతూ.. భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయాలు కేవలం ప్రార్థనా స్థలాలు మాత్రమే కావని, అవి మన విశ్వాసాన్ని, సామాజిక స్పృహను, ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని ప్రతిబింబించే సజీవ సంస్థలని పేర్కొన్నాడు. మన పవిత్ర వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందించడం మనందరి బాధ్యత అని ఆయన అన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూనే, మన సంప్రదాయాల్లో అంతర్భాగమైన జంతువులకు గౌరవప్రదమైన మరియు శాస్త్రీయమైన సంరక్షణ అందించడమే తన లక్ష్యమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్లు, ప్రధాన అర్చకులు మరియు బోర్డు సభ్యులు పాల్గొని అనంత్ అంబానీని సంప్రదాయబద్ధంగా గౌరవించి ప్రసాదాలను అందజేశారు.

# భారత స్వదేశీ విమానయాన భద్రతా పరికరాల పరీక్షా కేంద్రం ఏర్పాటుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న బీసీఏఎస్ - ఆర్ఆర్యూ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:భారతీయ విమానాశ్రయాల్లో వాడే ఫుల్ బాడీ స్కానర్లు (ఎఫ్బీఎస్), ఇతర భద్రతా తనిఖీ పరికరాల పనితీరును పరిశీలించడానికి, తనిఖీ పరీక్షలు నిర్వహించి ధృవీకరణ పత్రాలు ఇవ్వడానికి ఒక ప్రత్యేక స్వదేశీ పరీక్షా కేంద్రాన్ని నెలకొల్పి నిర్వహించడానికి బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్), రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీ (ఆర్ఆర్యూ) ఈరోజు ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి.

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, పౌర విమానయాన శాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా, బీసీఏఎస్ డైరెక్టర్ జనరల్ రాజేష్ నిర్వన్, రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బిమల్ పటేల్ సమక్షంలో ఈ ఒప్పందంపై న్యూఢిల్లీలో సంతకాలు జరిగాయి.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, "బీసీఏఎస్, రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీ మధ్య కుదిరిన ఈ ఒప్పందం భద్రతా పరిశోధన, సామర్థ్య పెంపుపై ఎన్డీయే ప్రభుత్వం పెడుతున్న ప్రత్యేక దృష్టి దిశగా మరో ముందడుగు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో పరిశోధనలు, ఆవిష్కరణలు, నైపుణ్యాల ద్వారా భద్రతను బలోపేతం చేయడం అత్యంత ప్రాధాన్యతగా మారింది. ఇది ప్రధానంగా ఆత్మనిర్భర్ భారత్, ఆత్మసురక్షిత్ భారత్ నిర్మాణం కోసమే!" అని పేర్కొన్నారు.

ఆర్ఆర్యూ వారసత్వాన్ని, సంస్థాగత సామర్థ్యాన్ని ప్రస్తావిస్తూ, "'రాష్ట్రీయ సురక్ష సర్వోపరి' అనే స్పష్టమైన లక్ష్యంతో 2010లో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ ఈ రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీని స్థాపించా రు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో ఇది ఈ రంగంలో ప్రపంచంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సంస్థలలో ఒకటిగా ఎదిగింది" అని అన్నారు.

విమానయాన భద్రతా పరికరాల పరీక్షలు, ధృవీకరణ, పరిశోధన, శిక్షణ, ప్రమాణాల అభివృద్ధిలో బీసీఏఎస్, ఆర్ఆర్యూ మధ్య భాగస్వామ్యం కోసం ఈ ఒప్పందం ఒక అధికారిక సంస్థాగత రూపాన్ని ఇస్తుంది. నమ్మకమైన, స్వతంత్ర, శాస్త్రీయ పద్ధతులతో కూడిన మూల్యాంకనం, నియంత్రణ మద్దతు ద్వారా భారత విమానయాన భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడం దీని లక్ష్యం.

ఈ అవగాహన ఒప్పందం ప్రకారం, ఆర్ఆర్యూ ఫుల్ బాడీ స్కానర్లు, ఇతర విమానయాన భద్రతా పరికరాల పరీక్షలు నిర్వహించడానికి బీసీఏఎస్ భాగస్వామ్యంతో ఒక ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుంది. ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఓఈఎంఎస్) సరఫరా చేసే పరికరాల ప్రమాణాలు, పనితీరును ఈ కేంద్రం స్వతంత్రంగా తనిఖీ చేసి ధృవీకరిస్తుంది. నిష్పక్షపాతమైన, శాస్త్రీయమైన నివేదికలను నియంత్రణ సంస్థల పరిశీలన కోసం సమర్పిస్తుంది.

విమానయాన భద్రతలో ఆత్మనిర్భరత ప్రాధాన్యతను వివరిస్తూ, "ఈ భాగస్వామ్యంలో విమానయాన భద్రతా పరికరాల తయారీలో ఆత్మనిర్భరత సాధించడం అత్యంత ముఖ్యం. విదేశీ ధృవీకరణ పద్ధతులతో సమానంగా ఎదుగుతూనే, విమానయాన భద్రతా సర్టిఫికేషన్ రంగంలో మనం అంతర్జాతీయ కేంద్రంగా మారాలి. ముఖ్యంగా భారతీయ తయారీదారులకు పరీక్షా సౌకర్యాలు కల్పించడం ద్వారా 'భారత ప్రమాణాల' అభివృద్ధిని వేగవంతం చేయవచ్చు" అని అన్నారు.

"బీసీఏఎస్ నియంత్రణ అధికారాన్ని, ఆర్ఆర్యూ సాంకేతిక నైపుణ్యాన్ని కలపడం ద్వారా భద్రతా పరికరాల ధృవీకరణ కోసం ఒక స్వదేశీ వ్యవస్థను నిర్మిస్తామని నేను గట్టిగా నమ్ముతున్నాను. ఇది అమెరికాలోని టీఎస్ఏ, ఐరోపాలోని ఈసీఏసీ వంటి అంతర్జాతీయ పద్ధతులతో సమానంగా ఉంటుంది" అని శ్రీ రామ్మోహన్ నాయుడు అన్నారు.

అత్యున్నత స్థాయి పనితీరు, భద్రత, పరస్పర అనుసంధాన ప్రక్రియలను పరీక్షించడానికి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆర్ఆర్యూనిలో అత్యాధునిక ప్రయోగశాలలను ఏర్పాటు చేయడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుంది. నిర్దేశించిన సాంకేతిక, నిర్వహణ ప్రమాణాలను అందుకునే పరికరాలను మాత్రమే కీలకమైన విమానయాన భద్రతా విభాగాలలో వాడేలా చూసేందుకు ఒక క్రమబద్ధమైన అక్రిడిటేషన్ వ్యవస్థను ఇది బలోపేతం చేస్తుంది.

ఈ ఒప్పందం విద్యా పరిశోధన, విస్తరణ,, శిక్షణ కార్యక్రమాలలో పరస్పర ప్రయోజనం కోసం సహకార విస్తరణకు కూడా దోహదపడుతుంది. విమానయాన భద్రతలో వస్తున్న కొత్త సాంకేతికతలు, పరీక్షలు, అక్రిడిటేషన్ రంగాలలో వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించడానికి వర్క్‌షాప్‌లు, ప్రత్యేక శిక్షణ, విజ్ఞానాన్ని పంచుకునే కార్యక్రమాల ద్వారా సామర్థ్యాన్ని పెంచుతారు.

ఈ భాగస్వామ్యం విమానయాన భద్రత రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది. దీనివల్ల మారుతున్న సవాళ్లు, సాంకేతిక మార్పులకు అనుగుణంగా పరీక్షా పద్ధతులు, అక్రిడిటేషన్ ప్రమాణాలు, వినియోగ నిబంధనలను నిరంతరం మెరుగుపరచవచ్చు. అంతేకాకుండా, భారత తనిఖీ, ధృవీకరణ వ్యవస్థను అంతర్జాతీయ అత్యుత్తమ విధానాలతో అనుసంధానించడానికి దేశీయ, అంతర్జాతీయ సహకారానికి ఇది తోడ్పడుతుంది.

విమానయాన రంగం శరవేగంగా విస్తరిస్తున్న తీరును కేంద్ర మంత్రి ప్రస్తావిస్తూ, "పౌర విమానయాన రంగంలో చోటు చేసుకుంటున్న విప్లవాత్మక వృద్ధిని మనమంతా చూస్తున్నాం. దేశంలోని విమానాశ్రయాల సంఖ్య 2014లో 74 ఉండగా, ఇప్పుడు 165కు పైగా పెరిగింది. ప్రతి గంటకు మన విమానాశ్రయాలు 250 నుంచి 300 విమానాల రాకపోకలను నిర్వహిస్తూ, సుమారు 40-45 వేల మంది ప్రయాణికుల అవసరాలను తీరుస్తున్నాయి. కేవలం ప్రయాణికులే కాకుండా, గత 10-12 ఏళ్లలో విమానాల ద్వారా సరకు రవాణా పరిమాణం కూడా దాదాపు 50% మేర భారీగా పెరిగింది.అందుచేత బీసీఏఎస్ కార్యకలాపాలలో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలను, వృత్తిపరమైన నైపుణ్యాన్ని అవలంబించడం చాలా ముఖ్యం. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా పటిష్టమైన విమానయాన భద్రత వ్యవస్థను నిర్మించే దిశగా బీసీఏఎస్, ఆర్ఆర్యూ మధ్య కుదిరిన ఈ ఒప్పందం ఒక ముందడుగు" అని పేర్కొన్నారు.

# 2025-26లో అత్యధికంగా 6.05 గిగావాట్లతో వార్షిక పవన విద్యుత్ అదనపు సామర్థ్యాన్ని సాధించిన భారత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:భారత్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో మునుపెన్నడూ లేని విధంగా అత్యధికంగా 6.05 గిగావాట్ల వార్షిక పవన విద్యుత్ సామర్థ్యాన్ని సాధించింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 5.5 గిగావాట్ల వార్షిక పవన విద్యుత్ గరిష్ట సామర్థ్య రికార్డును ఇది అధిగమించింది.

గత ఆర్థిక సంవత్సరం (2024-25)తో పోలిస్తే ఈ ఏడాది అదనంగా చేరిన సామర్థ్యంలో దాదాపు 46 శాతం వృద్ధి నమోదైంది. ఇది దేశ భూభాగ పవన విద్యుత్ విస్తరణ పథంలో నిర్ణయాత్మకమైన వేగాన్ని సూచిస్తోంది.

తాజా వృద్ధితో దేశంలోని మొత్తం స్థాపిత పవన విద్యుత్ సామర్థ్యం 56 గిగావాట్లను దాటింది. మెరుగైన స్పష్టమైన విధానాలు, విద్యుత్ ప్రసార సంసిద్ధత, పోటీతత్వంతో కూడిన ధరల నిర్ణయం, పటిష్టమైన ప్రాజెక్టుల రూపకల్పన వంటి అంశాలు ఈ రంగంలో సాధించిన వృద్ధిని ప్రతిబింబించాయి.

నిరంతర విధాన మద్దతు, ప్రాజెక్టుల మెరుగైన అమలు, ప్రధాన పవన విద్యుత్ రాష్ట్రాల్లో ప్రాజెక్టుల అభివృద్ధి ఫలితంగా ఈ మైలురాయిని సాధించడం సాధ్యమైంది. పెరుగుతున్న పవన-సౌర హైబ్రిడ్ ప్రాజెక్టులు, హరిత ఇంధన స్వేచ్ఛా వినియోగ ప్రగతిశీల విస్తరణ వంటి అంశాల కారణంగా గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు ఈ సంవత్సరంలో సామర్థ్య పెంపునకు కీలకపాత్ర పోషించాయి.

దేశ పవన శక్తి రంగం స్థిరంగా అభివృద్ధి చెందుతూ.. ప్రపంచంలోనే అగ్రగామి పవన శక్తి మార్కెట్లలో ఒకటిగా నిలిచింది. ఈ రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది.

వాటిలో పవన విద్యుత్ టర్బైన్ల తయారీలో ఉపయోగించే కొన్ని భాగాలు, ముడి పదార్థాలపై రాయితీ కస్టమ్స్ సుంకాన్ని కల్పించడం.. జూన్ 2028 వరకు అంతర్ రాష్ట్ర ప్రసార వ్యవస్థ ఛార్జీల దశలవారీ మినహాయింపు, పోటీ బిడ్డింగ్ విధానాలు, ప్రత్యేక పవన పునరుత్పాదక వినియోగ బాధ్యత విధానాలు, జాతీయ పవన శక్తి సంస్థ నుంచి సాంకేతిక మద్దతు వంటివి ఉన్నాయి.

ఈ రికార్డు స్థాయి వృద్ధి దేశ పునరుత్పాదక ఇంధన పోర్ట్‌ఫోలియోను గణనీయంగా బలోపేతం చేయడమే కాకుండా 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన ఆధారిత విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలనే జాతీయ లక్ష్యానికి గొప్ప ఊతాన్ని ఇస్తుంది.

ప్రభుత్వ విస్తృత పునరుత్పాదక ఇంధన వ్యూహంలో భాగంగా 1990వ దశకం ప్రారంభంలో దేశ పవన శక్తి కార్యక్రమం ప్రారంభమైంది.

గత మూడు దశాబ్దాలుగా గ్రిడ్-కనెక్టెడ్ పవన విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహిం చేందుకు భారత్ ఒక బలమైన పవన శక్తి పర్యావరణ వ్యవస్థను, పటిష్టమైన విధానపరమైన వ్యవస్థలను అభివృద్ధి చేసుకుంది.

# భూగర్భజలాల స్థాయిని పెంపొందించడమే 'జలధార ప్రాజెక్ట్' లక్ష్యం

-గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము..

-సిద్ధాంతంలో.. కాలువల పూడికతీత పనుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

-గ్రామస్తులతో కలిసి,పలుగు పారతో కాలువల్లో మట్టి తొలగింపు పనులు చేసిన ఎమ్మెల్యే

-వంద రోజుల కార్యచరణ ద్వారా కలిగే ప్రయోజనాలను..రైతులు, ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే



గుడివాడ, ఏప్రిల్ 7: రాష్ట్రంలో భూగర్భ జలాల స్థాయిని పెంపొందించేందుకే ప్రభుత్వం జలధార ప్రాజెక్టును ప్రవేశపెట్టిందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. జలమట్టం పెంపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జలధార ప్రాజెక్ట్ లో భాగంగా గుడివాడ రూరల్ మండలం సిద్ధాంతం గ్రామంలో జరుగుతున్న పూడిక తీత పనుల్లో మంగళవారం ఉదయం ఎమ్మెల్యే రాము పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి పలుగు పారతో కాలువల్లో మట్టిని తొలగిస్తూ ఎమ్మెల్యే రాము స్వయంగా పూడిక తీశారు. జలధార ప్రాజెక్టు వంద రోజుల కార్యాచరణ వల్ల కలిగే ప్రయోజనాలను రైతులు, గ్రామస్తులకు ఎమ్మెల్యే రాము వివరించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ భూగర్భ జలమట్టాలను పెంచేందుకు, నీటి భద్రత కోసం వంద రోజుల పాటు కార్యచరణ చేపట్టామన్నారు. చెరువుల్లో పూడికతీత, కాలువల మరమ్మతులు, భూగర్భజలమట్టం పెంపు లక్ష్యంగా 4 దశల్లో కార్యక్ర మాన్ని అమలు చేస్తామన్నారు. సాగునీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యతనే నినాదంతో పని చేయాలన్నారు.

మండల, గ్రామస్థాయిలో చెరువుల పూడికతీతతో భూగర్భజలాల స్థాయిని పెంపొందించడమే 'జలధార ప్రాజెక్ట్' ఉద్దేశమని అన్నారు. ఎండిఓ విష్ణు ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, టిడిపి నాయకులు వంశీకృష్ణ,కట్టా శ్రీనివాసరావు, వక్కలగడ్డ కాశీ, తోట సురేష్, అన్నవరపు నాగరాజు, కోరుమిల్లి స్వామి, రషీద్ బేగ్, సుబ్బారావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గంగామైదాన ప్రాంతంలో ప్రాచీన వ్యవసాయ రహస్యాలను ఛేదించిన గడ్డి పరాగ రేణువుల అధ్యయనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:సాగు పంటల నుంచి వచ్చే పరాగ రేణువులకు, అడవి గడ్డి పరాగ రేణువులకు మధ్య ఉన్న తేడాలను గుర్తించే ఒక కొత్త విధానాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ ఆవిష్కరణ భారత్ లో వ్యవసాయం అసలు ఎలా మొదలైందనే చరిత్రను తెలుసుకోవడానికి పరిశోధకులకు సహాయపడింది. ముఖ్యంగా మధ్య గంగా మైదాన ప్రాంతంలో వేల సంవత్సరాలుగా మనుషులు భూమిని ఎలా మార్చారో, వ్యవసాయం ఎలా అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవడానికి గొప్ప అవకాశాన్ని అందించింది.

ప్రపంచవ్యాప్తంగా ప్రధాన ఆహార వనరులైన వరి, గోధుమ ఉత్పత్తిలో భారత్ రెండో అతిపెద్ద దేశంగా ఉంది. ఈ నేపథ్యంలో గడ్డి జాతికి చెందిన మొక్కలలో ఏవి ఆహార ధాన్యాలు, ఏవి సాధారణ గడ్డి అనే తేడాను గుర్తించడం చాలా ముఖ్యమైన విషయం. ఇందుకోసం శాస్త్రవేత్తలు ఆయా ప్రాంతాలకు అనుగుణంగా కొన్ని ప్రత్యేకమైన బయోమెట్రిక్ ప్రమాణాలను ఏర్పరిచారు. ఈ విధానం ద్వారా పంట పొలాల పరాగ రేణువులను, అడవి గడ్డి పరాగ రేణువులను ఖచ్చితంగా వేరు చేసి గుర్తించవచ్చు. దీని ద్వారా గతంలో మానవులు ఎక్కడ నివసించారు.. ఏయే ప్రాంతాల్లో వ్యవసాయం చేశారు వంటి అంశాలను తెలుసుకునేందుకు ఈ అధ్యయనం ఎంతో దోహదపడుతుంది.

గోధుమ, వరి, బార్లీ, చిరు ధాన్యాలు వంటి చాలా రకాల ధాన్యపు పంటలు పోయేసి అనే గడ్డి జాతి కుటుంబానికి చెందినవి. వీటి పరాగ రేణువులు చూడటానికి అచ్చం అడవి గడ్డి పరాగ రేణువుల లాగే ఉంటాయి. సూక్ష్మదర్శినితో చూసినప్పుడు కూడా వీటి మధ్య తేడాలను గుర్తించడం చాలా కాలంగా కష్టతరంగా మారింది. ఈ పరాగ రేణువులు మట్టి పొరల్లో భద్రంగా నిల్వ ఉంటాయి. వీటి సమూహాలను విశ్లేషించడం ద్వారా హోలోసీన్ కాలంలో (గత11,700 ఏళ్లలో) జరిగిన వ్యవసాయం, అడవుల నరికివేత, మానవ నివాసాల ఏర్పాటు గురించి వివరాలను తెలుసుకోవచ్చు.

పరాగ రేణువుల సూక్ష్మ నిర్మాణాన్ని పరిశీలించడం ద్వారా.. ధాన్యం మొత్తం పరిమాణం, పరాగ రేణువు రంధ్రం చుట్టూ ఉండే వలయ పరిమాణం ఆధారంగా పండిం చిన పంట ధాన్యాలకు, అడవి గడ్డికి మధ్య ఉన్న తేడాలను గుర్తించవచ్చు. ఈ విధానం ద్వారా గతంలో పర్యావరణ పరిస్థితులు ఎలా ఉండేవి ప్రకృతిపై మానవ ప్రభావం ఎలా ఉండేదనే అంశాల గురించి తెలుసుకునేందుకు వీలవుతుంది.

పోయేసి గడ్డి జాతికి చెందిన ప్రధాన ఆహార పంటల గురించి, వాటికి సంబంధించిన అడవి జాతుల పరాగ రేణువుల సూక్ష్మ ఆకృతిపై పూర్తి స్థాయి అధ్యయనం ఇప్పటి వరకు జరగలేదు. గత కొన్ని వేల సంవత్సరాల నాటి మానవ కార్యకలాపాలను తిరిగి అంచనా వేయాలంటే శిలాజ పరాగరేణువులను ఖచ్చితంగా గుర్తించడం చాలా ముఖ్యం.

దేశంలోనే తొలిసారిగా జరిగిన ఈ పరిశోధనలో శాస్త్ర, సాంకేతిక విభాగం పరిధిలోని స్వయంప్రతిపత్తి సంస్థ బీర్బల్ సాహ్ని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాలియోసైన్సెస్ (బీఎస్ఐపీ) శాస్త్రవేత్తలు, వారి సహచరులతో కలిసి 22 రకాల ధాన్యపు, అడవి గడ్డి జాతులను విశ్లేషించారు. ఒక నమ్మకమైన బయోమెట్రిక్ ప్రమాణాన్ని రూపొందించడం కోసం వీరు లైట్ మైక్రోస్కోపీ (ఎల్ఎం), కన్ఫోకల్ లేజర్ స్కానింగ్ మైక్రోస్కోపీ (సీఎల్ఎస్ఎం), ఫీల్డ్ ఎమిషన్ స్కానింగ్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోపీ (ఎఫ్ఈఎస్ఈఎం) వంటి అత్యాధునిక సాంకేతికత పద్ధతులను ఉపయోగించారు. ఈ పరిశోధనలో శాస్త్రవేత్తలు ప్రధానంగా మధ్య గంగా మైదాన ప్రాంతంపై దృష్టి సారించారు.

సాగు పంటలు, అడవి గడ్డి జాతుల మధ్య తేడాను ఖచ్చితంగా గుర్తించేందుకు.. ఆయా ప్రాంతాలకు అనుగుణమైన బయోమెట్రిక్ ప్రమాణాలను రూపొందించడం అత్యంత అవసరం. దేశంలో విస్తారమైన సాగుభూములు వైవిధ్యమైన పంటలు ఉన్న మధ్య గంగా మైదాన ప్రాంతంలో ప్రాచీన మానవ నివాసాలను, వ్యవసాయ పద్ధతులను ఖచ్చితంగా అంచనా వేసేందుకు ఇది ఒక శక్తిమంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. అందుకే ఈ అధ్యయనానికి ఈ ప్రాంతం సరైనదిగా భావించి ఎంచుకున్నారు.

ఈ పరిశోధన శాస్త్రవేత్తలకు గతంలోని పర్యావరణాలను పునర్నిర్మించడానికి, అక్కడ పెరిగిన మొక్కలను గుర్తించ డానికి, కాలక్రమేణా భూమి ఎలా మారిందీ, పర్యావరణ వ్యవస్థల పై మానవుల ప్రభావం ఎలా ఉన్నదీ తెలుసుకోవడానికి సహాయపడింది.ది హోలోసీన్ (సేగ్ పబ్లికేషన్) శాస్త్రీయ పత్రికలో ప్రచురితమైన ఈ పరిశోధన.. ఒక స్పష్టమైన పెయిర్డ్ బయోమెట్రిక్ థ్రెషోల్డ్ ను రూపొందించింది.

దీని ప్రకారం సాగు పంటల పరాగ రేణువుల మొత్తం వ్యాసం సుమారు 46 మైక్రాన్ల కంటే ఎక్కువగా, వాటి రంధ్రం చుట్టూ ఉండే వలయ పరిమాణం 9 మైక్రాన్ల కంటే ఎక్కువగా ఉంటుంది. (అయితే 'సజ్జలు' మాత్రం దీనికి మినహాయింపు, ఇవి కొంచెం చిన్నవిగా ఉంటాయి). అడవి గడ్డి పరాగ రేణువుల కొలతలు ఈ విలువల కంటే తక్కువగా ఉంటాయి.

ఈ విధానం ద్వారా భారతీయ 'ఆహార భాండాగారం'గా పేరుగాంచిన మధ్య గంగా మైదాన ప్రాంతంలో సాగు పంటల పరాగ రేణువులను అడవి గడ్డి నుండి వేరు చేయడం సులభమవుతుంది. దీనివల్ల ప్రాచీన కాలంలో వ్యవసాయం ఎప్పుడు మొదలైంది, ఎంత విస్తృతంగా జరిగింది అనే విషయాలను ఖచ్చితంగా తెలుసుకోవచ్చు.

గంగా మైదాన ప్రాంతం నుంచి సేకరించిన స్థానిక సమాచారం ఆధారంగా ఇలాంటి ఒక నమూనాను రూపొందించడం ఇదే మొదటిసారి. దీనివల్ల శాస్త్రవేత్తలు ఐరోపా దేశాల పరాగ రేణువుల డేటాబేస్‌లపై ఆధారపడకుండా.. స్వదేశీ స్థానిక ఆధారాలతోనే మన వ్యవసాయ చరిత్రను తిరిగి తెలుసుకునే అవకాశం లభించింది.

లక్నోలోని బీఎస్ఐపీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ స్వాతి త్రిపాఠి నేతృత్వంలో ఈ అధ్యయనం జరిగింది. ఆమెతోపాటు డాక్టర్ ఆర్తి గార్గ్ (బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా- ప్రయాగ్‌రాజ్), ఆర్య పాండే, అనుపమ్ శర్మ (బీఎస్ఐపీ), ప్రియాంక సింగ్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ జియోమాగ్నెటిజం, ముంబయి), అన్షిక సింగ్ (లక్నో విశ్వవిద్యాలయం) కలిసి పనిచేశారు.

ఈ ఆవిష్కరణ ప్రాచీన వ్యవసాయం, భూ వినియోగం, పర్యావరణ వ్యవస్థలపై మానవ ప్రభావం వంటి అంశాలపై జరిగే పరిశోధనల ఖచ్చితత్వాన్ని గణనీయంగా పెంచుతుంది. గంగా నది పరివాహక ప్రాంతంలోని సారవంతమైన మైదానాలను మన పూర్వీకులు క్రమంగా ఒక ప్రధాన వ్యవసాయ కేంద్రంగా ఎలా మార్చారో అర్థం చేసుకోవడానికి పురావస్తు శాస్త్రవేత్తలకు, పర్యావరణ చరిత్రకారులకు ఎంతో సహాయపడుతుంది.

దేశంలో వ్యవసాయం, మానవ నివాసాల ఆవిర్భావాన్ని మరింత ఖచ్చితత్వంతో గుర్తించడానికి ఈ అధ్యయనం మన దేశానికి తొలిసారి ప్రాంతానుసారమైన, స్పష్టమైన శాస్త్రీయ సాధనాన్ని అందించింది.

# వివిధ జోన్లలో సిగ్నళ్ల ఆధునీకరణ, కవచ్ అమలు కోసం రూ. 1,364.45 కోట్లను ఆమోదించిన భారతీయ రైల్వే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:భారత రైల్వే వ్యవస్థలో భద్రత, సిగ్నలింగ్, సమాచార మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి రూ. 1,364.45 కోట్ల విలువైన బహుళ ప్రాజెక్టులకు భారత రైల్వే ఆమోదం తెలిపింది. మంజూరైన పనులలో లోకోమోటివ్‌లపై కవచ్ ఏర్పాటు, ఆప్టికల్ ఫైబర్ కేబుల్ వ్యవస్థ విస్తరణ, వివిధ రైల్వే జోన్లలో పాత ప్యానెల్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థల స్థానంలో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయి.

దక్షిణ రైల్వేలోని 232 లోకోమోటివ్‌లలో కవచ్ పరికరాల ఏర్పాటు

దక్షిణ రైల్వేలోని 232 లోకోమోటివ్‌లలో (రైలు ఇంజిన్లు) కవచ్ పరికరాలను ఏర్పాటు చేయడానికి రూ. 208.81 కోట్ల వ్యయంతో భారత రైల్వే ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదన '2024?25 పనుల కార్యక్రమం (పింక్ బుక్)లో పీహెచ్-33 కింద రూ 27,693 కోట్ల మొత్తం వ్యయంతో చేర్చిన "భారతీయ రైల్వేలోని మిగిలిన మార్గాల్లో లాంగ్ టర్మ్ ఎవల్యూషన్ ఆధారిత కమ్యూనికేషన్ వ్యవస్థతో కవచ్ ఏర్పాటు (అంబ్రెల్లా వర్క్ 2024?25)" ప్రాజెక్టులో భాగంగా ఉంది.

ఈ కార్యక్రమం కింద దక్షిణ రైల్వే కోసం రూ.2,950 కోట్లు కేటాయించారు. ప్రస్తుత పనులు ఈ ఉపకేటాయింపుల్లో భాగంగానే ప్రతిపాదించారు. లోకోమోటివ్‌లపై కవచ్ వెర్షన్ 4.0 పరికరాల సంస్థాపన దీని పరిధిలోకే వస్తుంది.

ఉత్తర రైల్వేలో 48 ఓఎఫ్‌సీ వ్యవస్థతో కమ్యూనికేషన్ వ్యవస్థ బలోపేతం

సమాచార మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ఉత్తర రైల్వేలో రూ.400.86 కోట్ల మొత్తం వ్యయంతో మూడు కీలక పనులను భారత రైల్వే మంజూరు చేసింది. ఇవి "రూ.4,871 కోట్ల వ్యయంతో పీహెచ్-33 కింద ఆమోదించిన భారతీయ రైల్వేలో కమ్యూనికేషన్ వ్యవస్థ బలోపేతం, మరమ్మత్తు, భర్తీ (అంబ్రెల్లా పనులు 2024?25)" ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి.

ఉత్తర రైల్వే కోసం రూ.871 కోట్ల సబ్-అంబ్రెల్లా నిధులు కేటాయించారు. అంబాలా డివిజన్‌లో 926.05 కిలోమీటర్ల మేర 48 ఫైబర్ కేబుల్స్ ఏర్పాటు చేయడానికి రూ. 115.74 కోట్లు.. ఢిల్లీ డివిజన్‌లో 1,204 కిలోమీటర్ల మేర 48 ఫైబర్ కేబుల్స్‌తో పాటు స్టేషన్లలో ఆప్టికల్ ఫైబర్ కమ్యూనికేషన్ గదుల ఏర్పాటు కోసం రూ. 165.49 కోట్లు.. లక్నో డివిజన్‌లో 1,074 కిలోమీటర్ల మేర 48 ఫైబర్ కేబుల్స్ ఏర్పాటు కోసం రూ. 119.63 కోట్లు కేటాయించారు. ఆధునిక సిగ్నలింగ్, కవచ్ వ్యవస్థల అమలుకు కీలకమైన కమ్యూనికేషన్ వ్యవస్థల సామర్థ్యా న్ని, విశ్వసనీయతను మెరుగు పరచడమే ఈ పనుల ప్రధాన లక్ష్యం.ఉత్తర మధ్య రైల్వేలో కవచ్ వ్యవస్థ అమలుకు మద్దతుగా రూ.176.7699 కోట్ల వ్యయం తో 48 ఫైబర్ ఆప్టికల్ వ్యవస్థ ఏర్పాటుకు భారత రైల్వే ఆమో దం తెలిపింది. ఈ పనులు కూడా రైల్వే సమాచార వ్యవస్థను బలోపే తం, మరమ్మత్తు, భర్తీకి ఉద్దేశిం చిన ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి.ఉత్తర మధ్య రైల్వే కోసం ఈ పథకం కింద రూ. 200 కోట్ల సబ్-అంబ్రెల్లా నిధులు కేటాయిం చారు. ప్రస్తుత పనిని ఈ కేటాయి ంపు కింద ప్రతిపాది ంచారు. ఈ నిధులతో మొత్తం 2,196 కిలో మీటర్ల మేర పనులు చేపడతారు. ఇందులో ప్రయాగ్‌రాజ్ డివిజన్ లో 1,016 కిలోమీటర్లు.. ఝాన్సీ డివిజన్‌లో 709 కిలోమీ టర్లు.. ఆగ్రా డివిజన్‌లో 471 కిలోమీటర్లు ఉన్నాయి.ఈ ప్రాజెక్టు కవచ్ వ్యవస్థ అమలుకు మద్దతు ఇవ్వడంతో పాటు, అధిక రద్దీ గల మార్గాల లో సమాచార మౌలిక సదు పాయాలను మెరుగుపరుస్తుంది.

దక్షిణ మధ్య రైల్వేలో పాత ప్యానెల్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థల స్థానంలో అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయడానికి రూ. 578.02 కోట్ల వ్యయంతో కూడిన రెండు ప్రధాన పనులను భారత రైల్వే మంజూరు చేసింది. " పీహెచ్-33 కింద రూ. 15,164 కోట్ల వ్యయంతో ఆమోదించిన హెచ్‌డీఎన్/ హెచ్‌యూఎన్ మార్గాల్లో(కవచ్, ఏబీఎస్, సీటీసీ అనుమతి ఉన్న చోట్ల) మిగిలి ఉన్న స్టేషన్లలో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ ఏర్పాటు (అంబ్రెల్లా పనులు 2024?25)" ప్రాజెక్టులో భాగం.

దక్షిణ మధ్య రైల్వే కోసం రూ. 1,857 కోట్ల సబ్-అంబ్రెల్లా నిధులు కేటాయించారు. దీని కింద రెండు పనులకు ఆమోదం లభించింది. గుంతకల్ డివిజన్‌లోని హెచ్‌డీఎన్, హెచ్‌యూఎన్ మార్గాల్లోని 35 స్టేషన్లలో రూ. 426.82 కోట్ల వ్యయంతో ప్యానెల్ ఇంటర్‌లాకింగ్‌ను తొలగించి ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ ఏర్పాటుతోపాటు నాందేడ్ డివిజన్‌లో హెచ్‌డీఎన్, హెచ్‌యూఎన్ మార్గాల్లోని 14 స్టేషన్లలో రూ.151.20 కోట్ల వ్యయంతో ఇదే తరహా వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు

# పేదలకు సత్వరమే సీఎంఆర్ఎఫ్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 7: సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన ఆర్థిక సాయా న్ని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మంగళవారం చెక్కులు, ఎల్ఓసీల రూపంలో లబ్ధిదారులకు అందజేశారు. మైలవరం నియోజకవర్గ పరిధిలోని 83 మందికి రూ.53.19 లక్షల రీఎంబర్స్ మెంట్ చెక్కులు, 25 మందికి రూ.56.01 లక్షలు ఎల్ఓసీల రూపంలో ఆర్థిక సాయం తాజాగా మంజూరైంది. మొత్తం 109 మందికి రూ.1.09 కోట్లు మంజూరయ్యాయి.

# ఆధునిక విద్యుత్తు వాహన చార్జింగ్... మౌలిక సదుపాయాల కల్పనకు భారత్-యూకే

## సహకారపూర్వక పరిశోధన, అభివృద్ధి కార్యక్రమం.. ఎస్‌ఛార్జ్ సంస్థకు టీడీబీ-డీఎస్‌టీ సహకారం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:“పవరింగ్ ఈవీ చార్జింగ్ ఇన్నొవేషన్” (విద్యుత్తు వాహనాల చార్జింగుకు సంబంధించిన నూతన ఆవిష్కరణలకు సహకరించడం) పేరిట చేపట్టిన ఒక ప్రాజెక్టును సాకారం చేసేందుకు ఎస్‌చార్జ్ సంస్థతో ఒక ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వ శాస్త్ర విజ్ఞాన- సాంకేతిక విజ్ఞాన విభాగం (డీఎస్‌టీ)లోని సాంకేతిక అభివృద్ధి మండలి (టీడీబీ) కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టును పారిశ్రామిక స్థిరత్వ సాధన లక్ష్యంగా రూపొందించిన భారత్-యూకే సహకారపూర్వక పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కార్యక్రమంలో భాగంగా బ్రిటన్ లోని అల్‌బ్రైట్ ప్రొడక్ట్ డిజైన్ సంస్థతో భాగస్వామ్యాన్ని ఏర్పరుచుకొని విద్యుత్తు వాహనాల (ఈవీ) చార్జింగు కోసం అవసరమైన ఉన్నత, సమర్థ సేవలను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో చేపడుతున్నారు.

వాణిజ్య వాహనాలతో పాటు డిపో నిర్వహణ కార్యకలాపాలకు ఉపయోగపడే తదుపరి తరం ఈవీ చార్జింగ్ సదుపాయాన్ని అభివృద్ధి పరచడంపై ఈ ప్రాజెక్టు దృష్టిని కేంద్రీకరిస్తుంది. ప్రతిపాదిత సాంకేతికత.. ఎస్‌చార్జ్ సంస్థ రూపొందించిన ఒక కొత్త రకం ఈవీ చార్జర్ చార్జి కంట్రోలరును బ్రిటన్ భాగస్వామ్య సంస్థకు పేటెంట్ ఉన్న స్వయంచాలక కేబుల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థతో ఏకీకరిస్తుంది. ఈవీ చార్జింగ్ అవసరాలకు గిరాకీ రోజు రోజుకూ అధికం అవుతున్నందు వల్ల, ఈ రంగంలో కార్యనిర్వహణ సామర్థ్యాన్నీ, భద్రతనీ, వినియోగ స్థాయినీ మెరుగుపరచడానికి ఈ ఏకీకరణ ప్రక్రియను అనుసరిస్తున్నారు.

దీనిలో భాగంగా ఒక యంత్రీకృత ఓవర్‌హెడ్ కేబుల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను పరిచయం చేసారు. దీనిని, వాహన ఆధారిత సేవలను దృష్టిలో పెట్టుకొని తయారు చేశారు. ఇది మనిషి ప్రమేయాన్ని తగ్గిస్తూ, కేబుల్ తరుగుదలను కనీస స్థాయికి పరిమితం చేస్తూ, వినియోగదారుకు అనుకూలతలను పెంచి, చార్జింగ్ కార్యకలాపాల్ని సువ్యవస్థీకరిస్తుంది. దీనిని ఇప్పుడున్న ఏసీ టైప్-2 విద్యుత్తు వాహన చార్జర్లలోనూ ఉపయోగించవచ్చును. డిపోల స్థాయిలో సురక్షిత, వ్యవస్థీకృత మౌలిక సదుపాయాల్ని ఈ వ్యవస్థ అందుబాటులోకి తీసుకువస్తుంది. వాహన రీచార్జింగ్ సమయాన్ని ఇప్పటి కన్నా మెరుగు పరుస్తుంది.

కేబుల్ నిర్వహణ, సామగ్రి రక్షణ, మెరుగైన పనితీరు వంటి కీలక నిర్వహణ సంబంధ సవాళ్లను పరిష్కరించడం ద్వారా, ఈవీ చార్జింగ్ డిపోల సామర్థ్యాన్ని ఈ సాంకేతికత చెప్పుకోదగినంతగా మెరుగుపరుస్తుందని భావిస్తున్నారు. కేబుళ్లు దెబ్బతినడాన్నీ, విధ్వంసం, ఇతరత్రా కార్యకలాపాల్లో ఎదురయ్యే ప్రమాదాల్నీ నివారించడం ద్వారా ఈ వ్యవస్థ చక్కని సురక్షా ప్రమాణాల్ని కూడా సమకూరుస్తుంది.

భారత విద్యుత్తు వాహన సాంకేతిక రంగంలో ప్రవర్ధమాన సంస్థల్లో ఎస్‌చార్జ్ సంస్థ ఒకటి. ఈ సంస్థ.. ఆధునిక పవర్ ఎలక్ట్రానిక్స్, స్మార్ట్ చార్జింగ్ వ్యవస్థలను అభివృద్ధిపరచడంపై దృష్టిని కేంద్రీకరించింది. ఈ ప్రాజెక్టును చేపట్టి ఈవీ చార్జింగ్ సాంకేతిక రంగంలో దేశీయ శక్తి సామర్థ్యాలను బలోపేతం చేయాలనీ, అంతకంతకూ అభివృద్ధి చెందుతున్న విద్యుత్తు ఆధారిత రాక పోకల రంగంలో విస్తరించదగిన, దీర్ఘకాలం మన్నికతో కూడిన మౌలిక సదుపాయాల్ని సమకూర్చాలనీ ఈ సంస్థ ధ్యేయంగా పెట్టుకుంది.

టీడీబీ కార్యదర్శి శ్రీ రాజేశ్ కుమార్ పాఠక్ మాట్లాడుతూ... భారత్-యూకే కార్యక్రమం వంటి సహకారపూర్వక ఆర్ అండ్ డీ కార్యక్రమాలు ఉన్నత, పరిశ్రమలకు సంబంధించిన సాంకేతికతల అభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేయడంలో ఒక కీలక పాత్రను పోషిస్తున్నాయన్నారు. విద్యుత్తు వాహనాల్ని అధిక సంఖ్యలో వినియోగించడానికీ, భారత్‌లో దృఢతర, సమర్థ, రాబోయే కాలం అవసరాలను తీర్చగల విద్యుత్తు వాహన చార్జింగ్ సంబంధిత మౌలిక సదుపాయాల కల్పనలో నూతన ఆవిష్కరణల్ని ప్రవేశపెట్టడంతో పాటు అనుబంధ విస్తారిత వ్యవస్థను ఏర్పాటు చేయడం కూడా ప్రధానమేనని ఆయన తెలిపారు.

ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ఎస్‌చార్జ్ సంస్థ ప్రమోటరు ప్రశంసించారు. ఈ ప్రాజెక్టు ఎప్పటికప్పుడు మార్పుల కు లోనవుతున్న ఫ్లీట్ ఆపరేటర్ల, మౌలిక సదుపాయాల సేవల ప్రదాత సంస్థల అవసరాలను తీర్చడంతో పాటు వినూత్న విద్యుత్తు వాహన చార్జింగ్ సదుపాయాల్నీ, ప్రపంచ దేశాలతో పోటీ పడ గలిగే విద్యుత్తు వాహన చార్జింగ్ సదుపాయాల్నీ మార్కెట్టుకు అందించడంలో తమ సంస్థకు దోహద పడుతుందని ఎస్‌చార్జ్ సంస్థ యజమాని వ్యాఖ్యానించారు.

# ఏపీ అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

### రాజధాని అమరావతిని అత్యాధునిక నగరంగా తీర్చిదిద్దే సత్తా చంద్రబాబుకే ఉంది

### చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం ఆధ్వర్యంలో “అమరావతి పవిత్ర జల హారతి” మహోత్సవం..

### ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కేశినేని శివనాథ్ తనయుడు కేశినేని వెంకట్..

విజయవాడ, ఏప్రిల్ 7: ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి సమర్థ నాయకుడైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టిడిపి యువ నాయకులు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కుమారుడు కేశినేని వెంకట్ అన్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి సమున్నత అభివృద్ధిని కాంక్షిస్తూ, నవ్యాంధ్రప్రదేశ్ చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం ఆధ్వర్యంలో “అమరావతి పవిత్ర జల హారతి” మహోత్సవం× విజయవాడ దుర్గా ఘాట్ లో మంగళవారం నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేశినేని వెంకట్ పవిత్ర కృష్ణానదికి జల హారతి ఇచ్చారు. ముందుగా చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం సభ్యులు రాష్ట్ర రాజదాని అమరావతి నిర్మాణానికి ఎలాంటి ఆటంకం కలగకుండా సాగాలని సంకల్పిస్తూ రామానుజాచార్యుల విగ్రహం వద్ద తిరుప్పావై పారాయణం చేశారు. అనంతరం కేశినేని వెంకట్ రామానుజాచార్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించి జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

అలాగే కేశినేని వెంకట్, చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం సభ్యులతో కలిసి రాష్ట్ర రాజదాని అమరావతి కి చట్టబద్ధత కల్పించి నందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వంతో పాటు ఎంపీ కేశినేని శివనాథ్ కు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ లకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్ల కార్డులు ప్రదర్శించి తమ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేశినేని వెంకట్ మాట్లాడుతూ. ఆంధ్ర రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతి చట్టబద్ధత పొందటం రాష్ట్ర ప్రజలందరికీ ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. పార్లమెంటులో అమరావతి చట్టబద్ధత బిల్లుకు అన్ని ప్రముఖ పార్టీల సహకారం లభించడం రానున్న కాలంలో అమరావతి అభివృద్ధికి సంకేతం అన్నారు.

అమరావతి రానున్న కాలం లో ప్రపంచంలోనే మేటి నగరంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో రూపు దిద్దు కుంటుందని తెలిపారు. అమరావతి అభివృద్ధిలో భాగంగా విజయవాడ నగరాన్ని సైతం గ్రేటర్ విజయవాడ గా చేయాలని ఈ సందర్భంగా కేశినేని వెంకట్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు విజ్ఞప్తి చేస్తూ మాట్లాడారు. నవ్యాంధ్రప్రదేశ్ చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, మధురాంతకం శ్రీనివాసరావు మాట్లాడుతూ అమరావతి శాశ్వత రాజధానిగా రూపు దిద్దుకుంటున్న శుభ సమయంలో తాము సైతం అమరావతి రాజ ధాని నిర్మాణం ఎటువంటి నిర్విఘ్నం లేకుండా సక్రమంగా జరగాలని పూజలు చేస్తున్నామన్నారు.

ఆ క్రమంలోనే జలహారతి కార్యక్రమాన్ని ఇంద్రకీలాద్రి దుర్గమ్మ సన్నిధిలోని పవిత్ర కృష్ణానది తీరంలో దుర్గా ఘాట్ నందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చాత్తాద శ్రీ వైష్ణవులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాజకీయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రోత్సాహం అందిస్తే, విజయవాడ వంటి నగరంలో డివిజన్ అధ్యక్షులుగా, పశ్చిమ నియోజకవర్గంలో ఓ విభాగానికి అధ్యక్షులుగా తమ కులస్తులను నియమించి రాజకీయంగా చేయూత అందిస్తున్న నాయకులు ఎంపీ కేశినేని చిన్ని అంటూ ధన్యవాదాలు తెలిపారు.

అమరావతి రాజధాని బిల్లు సమయంలో ఎంపీగా కేశినేని చిన్ని ఉండటం, బిల్లుకు మద్దతు తెలుపటం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. విజయవాడ గ్రేటర్ గా కూడా ఎంపీ కేశినేని చిన్ని నేతృత్వంలోనే జరగాలని తామంతా కోరుకున్నట్లు వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో వైష్ణవ గురువర్యులు తిన్నలూరి ప్రసాద్, నూరేపల్లి రాము, పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, తెలుగు మహిళలు, వివిధ విభాగాలకు బాధ్యులు పాల్గొన్నారు.

# ఎండ తీవ్రతకై జాగ్రత్తలు తీసుకోవాలి?...



అమరావతి, ఏప్రిల్ 7:ఎండాకాలం అంటేనే ఎండలు, వడగాల్పులు తీవ్రంగా ఉంటాయి. వాటి తీవ్రతకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తనయుడు సిద్ధార్ధ అన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 58వ డివిజన్ సాయిబాబా గుడి సెంటర్ వద్ద ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు సూచన మేరకు వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టీడీపీ యువ నాయకుడు బొండా సిద్దార్ధ ఘనంగా ప్రారంభించారు.

తెలుగుదేశం పార్టీ కార్యకర్త సుల్తానా, ఈశ్వర్ కుమార్తె హనిశ్రీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈసేవా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చలివేంద్రం ద్వారా పాఠశాల విద్యార్థులు, వాహనదారులకు, స్థానిక ప్రజలకు చల్లని మజ్జిగను ఆయన పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పిరియ జగదాంబ, డివిజన్ అధ్యక్షుడు కూర్మాపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి మల్లంపాటి రవికుమార్, ఇంచార్జ్ పిరియ సోమేశ్వరరావు, క్లస్టర్ ఇంఛార్జి సుర్విపల్లి అమర్నాధ్ గౌడ్, చిట్టితల్లి తదితరులు పాల్గొన్నారు.

# గుండె జబ్బులపై అవగాహన

అమరావతి, ఏప్రిల్ 7:: నడక ద్వారా ఆరోగ్యాన్ని పదిలంగా చూసుకోవచ్చని వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ కె.శ్రీనివాసరాజు, ఎలెక్ట్ గవర్నర్ ఎన్. బి.జి. ఎమ్ ప్రసాద్ అన్నారు. అజిత్ సింగ్ నగర్ మాకినేని బసవపున్నయ్య మల్టీ పుర్పస్ స్టేడియంలో మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వాకర్స్ ఆధ్వర్యంలో గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సాయి ప్రకాష్ పాల్గొని గుండె వ్యాధులుకు సంబంధించిన అనేక విషయాలు వివరించి, ఉచితంగా ఈ. సి. జి పరీక్షలు నిర్వహించారు. ప్రతిరోజూ నడక నడవడం ద్వారా గుండె, మెదడు సమతుల్యంలో పని చేస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్ కె. ఎస్. ఎన్ మూర్తి, కార్యదర్శి కోన కుటుంబరావు, ట్రెజర్ సూర్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# తొలిదశను దాటిన తమిళనాడులోని కల్పకం మోడల్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:భారత అణు విద్యుత్ కార్యక్రమంలో కీలకమైన విజయం నమోదయింది. దీర్ఘకాల విద్యుత్ భద్రతను అందించడంలో, స్వదేశీ అణు పరిజ్ఞాన సాంకేతికతలను ముందుకు తీసుకెళ్లడంలో సాధించిన విజయాన్ని సూచిస్తూ.. 2026 ఏప్రిల్ 6 రాత్రి 8.25కు 500 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యమున్న ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ (పీఎఫ్‌బీఆర్) విజయవంతంగా తొలి క్రిటికాలిటీని సాధించింది (నియంత్రిత అణు విచ్ఛిత్తి గొలుసు చర్య ప్రారంభమైంది).

డీఏఈ కార్యదర్శి, ఏఈసీ ఛైర్మన్ డాక్టర్ అజిత్ కుమార్ మహంతి, ఐజీసీఏఆర్ డైరెక్టర్ శ్రీ శ్రీకుమార్ జీ పిళ్లై, భావిని సీఎండీ ఇన్‌చార్జి శ్రీ అల్లు అనంత్, భావిని మాజీ సీఎండీ, హోమీ సేత్నా ఛైర్మన్ శ్రీ కేవీ సురేష్ కుమార్ సమక్షంలో తొలి క్రిటికాలిటీ ప్రారంభమైంది. అణు విద్యుత్ నియంత్రణా బోర్డు (ఏఈఆర్‌బీ) నిబంధనలను పాటించడంతో ఇది సాధ్యమైంది. ప్లాంటు వ్యవస్థల భద్రతను క్షుణ్ణంగా సమీక్షించిన అనంతరం అవసరమైన అనుమతులను ఏఈఆర్‌బీ జారీ చేసింది.

పీఎఫ్‌బీఆర్‌కు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, నమూనాను ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్ (ఐజీసీఏఆర్), అణుశక్తి విభాగానికి చెందిన ఆర్ అండ్ డీ సెంటర్ దేశీయంగా అభివృద్ధి చేశాయి. అణుశక్తి విభాగంలోని ప్రభుత్వ రంగం సంస్థ అయిన భారతీయ నభికీయ విద్యుత్ నిగమ్ (భావిని) దీనిని నిర్మించి, ప్రారంభించింది.

భారత్ అనుసరిస్తున్న దీర్ఘకాల అణు వ్యూహంలో ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లు అత్యంత ప్రధానమైనవి. సంప్రదాయ థర్మల్ రియాక్టర్లలా కాకుండా, యురేనియం-ప్లుటోనియం కలిపిన ఆక్సైడ్ (ఎంవోఎక్స్) ఇంధనాన్ని పీఎఫ్‌బీఆర్ ఉపయోగిస్తుంది. పీఎఫ్‌బీఆర్ కోర్ చుట్టూ యురేనియం-238 పొర ఉంటుంది. వేగవంతమైన న్యూట్రాన్లు శుద్ధి చేసిన యురేనియం-238ను విచ్ఛిన్నమయ్యే ప్లూటోనియం-239గా మారుస్తాయి. దీనివల్ల రియాక్టర్ వినియోగించుకొనే దానికంటే అధిక ఇంధనాన్ని ఉత్పత్తి చేయగలుగుతుంది. క్రమంగా బ్లాంకెట్‌లో థోరియం-232ను ఉపయోగించేలా ఈ రియాక్టర్‌ను రూపొందించారు. థోరియం-232 ను యురేనియం-233గా మారుస్తారు. ఇది భారతదేశ అణు విద్యుత్ కార్యక్రమ మూడో దశను వేగవంతం చేస్తుంది.

ఈ ప్రత్యేకమైన సామర్థ్యం.. అణు ఇంధన వనరుల వినియోగాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుంది. అదేవిధంగా పరిమిత యురేనియం నిల్వల నుంచి మరింత ఎక్కువ శక్తిని ఉత్పత్తి చేసేందుకు, అదే సమయంలో భవిష్యత్తులో థోరియంను భారీ స్థాయిలో వినియోగించుకొనేందుకు మార్గం సుగమం అవుతుంది.

తొలి క్రిటికాలిటీని సాధించడంతో, మూడు దశల అణు విద్యుత్ కార్యక్రమానికున్న పూర్తి సామర్థ్యాన్ని ఉపయోగించుకొనే దిశగా భారత్ మరింత ముందుకు సాగింది. ప్రస్తుత ప్రెషరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్ల సముదాయానికి, భవిష్యత్తులో ఏర్పాటు చేయబోయే థోరియం ఆధారిత రియాక్టర్లకు మధ్య ఒక కీలకమైన వారధిగా ఫాస్ట్ బ్రీడర్ టెక్నాలజీ నిలుస్తుంది. దీనివల్ల దీర్ఘకాలిక శుద్ధ ఇంధన ఉత్పత్తి కోసం దేశంలో సమృద్ధిగా ఉన్న థోరియం వనరులను సద్వినియోగం చేసుకోవచ్చు.

భారత దేశానికున్న దేశీయ నమూనా, ఇంజినీరింగ్, తయారీ వ్యవస్థల సామర్థ్యాన్ని ఈ విజయం ప్రదర్శిస్తుంది. ఈ రియాక్టర్లో అధునాతన రక్షణ వ్యవస్థలు, అధిక ఉష్ణోగ్రత కలిగిన ద్రవ సోడియంతో చల్లబరిచే సాంకేతిక పరిజ్ఞానం, అణు పదార్థాల పునర్వినియోగాన్ని సాధ్యం చేసే క్లోజ్డ్ ఫ్యూయల్ సైకిల్ విధానం ఉన్నాయి. తద్వారా ఇది సుస్థిరతను మెరుగుపరిచి, వ్యర్థాలను తగ్గిస్తుంది. దేశీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని, వస్తువులను ఉపయోగించి నమూనా, రూపకల్పన, నిర్మాణం లో భాగమైన అనేక మంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, టెక్నీషియన్లు, పారిశ్రామిక భాగస్వాముల అంకితభావాన్ని ఈ ప్రాజెక్టు ప్రతిబింబిస్తుంది. వారి ప్రయత్నాలు.. అధునాతన న్యూక్లియర్ ఇంజినీరింగ్‌లో పెరుగుతున్న దేశ సామర్థ్యాన్ని, ఆత్మనిర్భర భారత్ లక్ష్యానికి అనుగుణంగా సాంకేతిక స్వావలంబన సాధించే భారత దేశ నిబద్ధతను తెలియజేస్తున్నాయి. విద్యుదుత్పత్తి పరిధిని దాటి.. న్యూక్లియర్ ఫ్యూయల్ సైకిల్ టెక్నాలజీ, అధునాతన పదార్థాలు, రియాక్టర్ ఫిజిక్స్, భారీ స్థాయి ఇంజినీరింగ్‌లో వ్యూహాత్మక సామర్థ్యాలను ఫాస్ట్ బ్రీడర్ కార్యక్రమం బలోపేతం చేస్తుంది.

శుద్ధ ఇంధన పోర్ట్‌ఫోలియోను భారత్ విస్తరిస్తున్న నేపథ్యంలో అత్యధిక ఉష్ణ సామర్థ్యంతో విశ్వసనీయమైన, తక్కువ కర్బన ఉద్గారాలున్న, బేస్-లోడ్ విద్యుత్‌ను అందించడంలో ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లు కీలకపాత్ర పోషిస్తాయి. మొదటి క్రిటికాలిటీని సాధించడం సాంకేతికపరమైన విజయం మాత్రమే కాకుండా.. వికసిత భారత్ కోసం సుస్థిరమైన, స్వయం సమృద్ధి సాధించిన ఇంధన భవిష్యత్తు దిశగా వేసిన ముఖ్యమైన అడుగును సూచిస్తుంది.

# ఇది ‘ఆత్మనిర్భర్ భారత్’ సాధన దిశగా చేస్తున్న ప్రయాణానికి సరికొత్త వేగం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:సారస్వత్ సహకార బ్యాంకు, అమూల్ తమ ప్రగతి ప్రస్థానంలో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.1 లక్ష కోట్ల మొత్తం వ్యాపారాన్ని నమోదు చేసినందుకు కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఆ సంస్థలకు అభినందనలు తెలిపారు.

సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ లో శ్రీ అమిత్ షా ఒక సందేశాన్ని పొందుపరుస్తూ -“సారస్వత్ సహకార బ్యాంకుతో పాటు అమూల్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.1 లక్ష కోట్ల వార్షిక టర్నోవరును అధిగమించడం మన సహకార రంగ శక్తి సామర్థ్యాలు అపారమైనవని నిరూపించే ఓ స్పష్టమైన ఉదాహరణ. ఈ విజయం సహకార బ్యాంకింగ్ రంగానికీ, పాడి రంగానికీ చరిత్రాత్మకమైందే కాకుండా, ‘ఆత్మనిర్భర్ భారత్’ సాధన దిశగా సాగుతున్న ప్రయాణానికి కొత్త శక్తిని సమకూరుస్తుంది. గర్వకారణమైన ఈ విజయాన్ని సాధించిన అమూల్, సారస్వత్ సహకార బ్యాంకుల కర్మయోగులందరికీ హృదయపూర్వక అభినందనలను తెలియజేస్తున్నాను’’ అని పేర్కొన్నారు.

# జిల్లా పరిషత్ భవన పనులు వేగవంతం చేయాలి

**-కలెక్టర్ దీపక్ తివారి**

వికారాబాద్, ఏప్రిల్ 7: జిల్లాలో పరిపాలన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భవనం నిర్మాణం ద్వారా అన్ని విభాగాలను ఒకే చోట సమీకరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని, నిర్మాణ పనుల పురోగతిని సమీక్షిస్తూ, పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

భవనంలో ఆధునిక సౌకర్యాలు, సమావేశ మందిరాలు, కార్యాలయ గదులు ఏర్పాటు చేస్తున్నట్లు, భవనం నిర్మాణంలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, అవసరమైన మౌలిక సదుపాయాలు విద్యుత్, నీటి సరఫరా, పార్కింగ్ వసతులు కల్పించాలని అన్నారు. ఈ భవనం పూర్తయిన తరువాత ప్రజలకు పరిపాలనా సేవలు వేగవంతంగా, సులభంగా అందుతాయని అన్నారు. మొదటి అంతస్తు పనులు పూర్తి అయిన వాటికీ పేంటింగ్ పనులు పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ తో పాటు జడ్ పి సి ఇ ఓ సుదీర్, ఉమేష్ కుమార్, డిప్యూటీ ఇ ఇ శ్రీనివాస్, సంబంధిత అధికారులు ఉన్నారు.



# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వ్యాధి నిరోధక, ఆరోగ్యాభివృద్ధి సేవలకు ప్రాధాన్యం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువుల మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా శుభాకాంక్షలు తెలియజేశారు.

మన ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ వహించాలని, సమతుల్య జీవన విధానం అనుసరించాలని ఈ రోజు మనకు గుర్తు చేస్తుంది. ప్రాచీన విజ్ఞానాన్ని ఆధునిక శాస్త్రంతో మేళవించే భారతీయ విధానం.. మన దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్నవారి జీవితాలను మెరుగుపరిచేందుకు దోహదపడుతుంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో చేపట్టిన ఆయుష్మాన్ భారత్, పీఎం భారతీయ జన ఔషధి పరియోజన లాంటి పరివర్తనాత్మక పథకాలు ఆరోగ్య సేవల వ్యవస్థను బలోపేతం చేశాయి. ప్రతి పౌరునికి నాణ్యమైన చికిత్సను చవకగా అందుబాటులో తీసుకువచ్చాయి. వైద్య సేవల రంగాన్ని దృఢంగా నిలుపుతూ.. అంకిత భావంతో పని చేస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఆరోగ్యకరమైన, బలమైన దేశాన్ని నిర్మించే దిశగా మనందరం కలసి పనిచేద్దాం” అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువుల మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా పోస్టు చేశారు.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రావడం ఖాయం

-టీఆర్ఎస్ పార్టీ కుటుంబ తగాధలతో సతమతం
-బీజేపీ పేదలకు చేసింది ఏమీ లేదు
-ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ వస్తున్నాం
-కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను కలుపుకుపోతుంది
-మహబూబ్నగర్ జిల్లాపై పార్టీకి ప్రత్యేక కమిట్మెంట్ ఉంది
-పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం చేస్తాం
-పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి
-ప్రభుత్వం పార్టీ సమన్వయంగా ముందుకు సాగాలి
-సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
-రాష్ట్ర తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

నాగర్ కర్నూల్,ఏప్రిల్ 7: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, 100 స్థానాలు గెలుస్తామని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీ కుటుంబ తగాదాలతో సతమతమవుతున్నదని బావ బామ్మర్దులు పదవుల కోసం తగాదాపడుతున్నారని కూతురు వేరే




కుంపటి పెట్టుకున్నారని, తండ్రిని ఫామ్హౌస్కే పరిమితం చేశారని ఈ నేపథ్యంలో టిఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో మనుగడ లేదని బిజెపి పార్టీ రెండున్నర సంవత్సరాలలో పేదలకు చేసింది ఏమీ లేదని ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని 100 సీట్లతో మళ్లీ ప్రభుత్వం చేపడతామని మహేష్ కుమార్ గౌడ్ తన విశ్వాసాన్ని ప్రకటించారు.

మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన డిసిసి కార్యాలయం ప్రారంభం, జిల్లా కాంగ్రెస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి అచ్చంపేట శాసనసభ్యులు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడైన వంశీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు ఈ సభలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని సంక్షేమం అభివృద్ధి నినాదంతో ఆ ఫలాలు ప్రజలకు అందుతున్నాయని ఆయన వివరించారు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటుందని ఒక్కొక్కటిగా పూర్తి చేస్తూ వస్తున్నామని హామీలను అమలు చేస్తున్నామని చెప్పారు.

ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సు ,రేషన్ కార్డులు, పెన్షన్లు, మహాలక్ష్మి పథకం ఇలా అన్ని అమలు చేస్తూ వస్తున్నామని వివరించారు కెసిఆర్ పాలనలో జలదోపిడి జరిగిందని కాళేశ్వరం సంగతి అందరికీ విధితమేనని అన్నారు మహబూబ్నగర్ ఉమ్మడి జిల్లాలో టిఆర్ఎస్ఏ ప్రాజెక్టు పూర్తి చేయలేదని చెప్పారు. కాంగ్రెస్ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా మొత్తం సంపూర్ణంగా సస్యశ్యామలం చేయాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జాతీయ హోదా కావాలని పార్లమెంటు వేదికగా పోరాటం చేస్తున్నామని అన్నారు.

విభజన హామీలు నెరవేర్చాలని విషయంలో జాతీయ హోదాపై పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలపై బిజెపికి ఉలుకు పలుకు లేదని ఎద్దేవా చేశారు. సంపూర్ణంగా కృష్ణాజిల్లాలు వాడుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ జిల్లా వాసి అయిన రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీకి లక్ష్యంగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని వేటి జిల్లాగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ శాశ్వతమని కాంగ్రెస్ ప్రజాసేవని ధ్యేయంగా ముందుకు సాగుతున్నదని సంక్షేమం అభివృద్ధి ఫలాలను బూత్ స్థాయిలో గ్రామాలలో ప్రజలకు చెప్పాలని తెలిపారు.

2003 నుండి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేవరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు టిఆర్ఎస్ పాలనలో లాటీలు తినడం జైళ్లకు వెళ్లడం బయటాయింపులు చేయడం ఇలా అనేక ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు చేయడం వల్ల కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ ఎస్టీ బీసీలకు 72 శాతం పదవులు ఇచ్చిందని జనాభా నిష్పత్తి ప్రకారం ప్రభుత్వ పలాలు అందించుటకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాహుల్ గాంధీ జూడో యాత్ర తర్వాత కులగనన చేయడం జరిగిందని దానిని దేశంలో రోల్ మోడల్ గా రాష్ట్రంలో చేపట్టడం జరిగిందని చెప్పారు .

పార్టీ నిర్మాణం కోసం సమర్థవంతంగా శక్తివంతం లేకుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. నామినేటెడ్ పోస్టులు కూడా రాష్ట్రవ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న వాటిని క్రమక్రమంగా భర్తీ చేస్తున్నామని పార్టీలో పని చేసిన వారికి తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని వారికి అవకాశాలు వస్తాయని మహేష్ కుమార్ గౌడ్ అనేక అనుభవాలను వివరిస్తూ భరోసా కల్పించారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త నాయకుడు ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి సి డబ్ల్యూ సి సభ్యులు సచిన్ సావంత్, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీ చందర్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి, మంత్రి జూపల్లి కృష్ణారావు శాసనసభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డిఓబిసి జాతీయ నాయకులు కేతూరు వెంకటేష్ గ్రంథాలయ చైర్మన్ రాజేందర్ జెడ్పి మాజీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ మహిళా నాయకురాలు సంధ్య రెడ్డి ఇందిరా శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్కు ప్రశంసా పురస్కారం

భద్రాచలం, ఏప్రిల్ 07 : భద్రాచలం ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ చేతుల మీదుగా ప్రశంసా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ.. ఈ గుర్తింపు తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. భవిష్యత్‌లో మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. అటవీ ప్రాంతాలు, దూర గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులకు సమయానికి వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు.

అలాగే ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు వలు కార్యక్రమాలు నిర్వహిస్తూ, రోగ నిరోధక చర్యలపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని, ప్రభుత్వం అందిస్తున్న సహకారం, వైద్య సిబ్బంది కృషి, సహచరుల మద్దతుతోనే ఈ స్థాయి గుర్తింపు సాధ్యమైందని డాక్టర్ రామకృష్ణ తెలిపారు. అదేవిధంగా భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పని చేస్తున్న డాక్టర్ క్రాపా విజయ్, ఎ.వెంకటరావుకు ప్రశంసా పురస్కారాలు దక్కాయి.

# ఆరోగ్య పరిరక్షణకు సరైన వ్యాయామం సైక్లింగ్

## - జిల్లా సిపీ గౌస్ ఆలం

హైదరాబాద్, ఏప్రిల్ 7:డిజిటల్ తెరలకు అతుక్కుపోతూ, శారీరక కదలికలను మరిచి అనారోగ్యాల పాలు అవుతున్న నేటి యువతకు సరైన వ్యాయామంగా సైక్లింగ్ దోహదపడుతున్నదని కరీంనగర్ జిల్లా పోలీసు కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రెనీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, ఆల్ఫోర్స్ విద్యా సంస్థలు, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్, ఐఎంఏ సంయుక్తంగా నిర్వహించిన సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించిన సిపీ మాట్లాడుతూ శారీరక వ్యాయామానికి దూరంగా విపరీత పోకడలతో కూడిన ఆధునిక జీవనశైలిలో విషవలయంలో చిక్కి తమ ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ప్రతి రోజు 30 - 60 నిమిషాల పాటు నడక, పరుగు, ఈత, జిమ్, యోగా, ధ్యాన వ్యాయామాలకు సమయాన్ని వెచ్చించాలని అన్నారు. ఆల్ఫోర్స్ అధినేత వి నరేందర్ రెడ్డి, రెనీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ నేటి యువభారతం సైక్లింగ్ అలవాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సైక్లింగ్‌ను ఒక ఒలింపిక్ స్పోర్ట్‌గా తీసుకొని జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని అన్నారు. ఆరోగ్య సంరక్షణకు ప్రతి రోజు కొంత సమయాన్ని పెట్టుబడిగా పెట్టాలని చెప్పారు. కరీంనగర్ పోలీస్ పరెడ్ గ్రౌండ్‌లో సిపీ గౌస్ ఆలం జెండా ఊపి ప్రారంభించిన సైకిల్ ర్యాలీ బస్ స్టాండ్, తెలంగాణ చౌరస్తా, ఆర్ అండ్ బి చౌరస్తా, కోర్టు చౌరస్తా మీదుగా రెనీ ఆసుపత్రి వరకు కొనసాగింది. రెనీలో జరిగిన ముగింపు సమావేశంలో పాల్గొన్న వందకు పైగా యువ సైక్లిస్టులు, పాఠశాల



విద్యార్థులను నిర్వాహకులు ప్రశంసించారు. ఈ ర్యాలీలో రెనీ పరిపాలనాధికారి అరవింద్, సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి సురభి వేణుగోపాల్, ఇనుగుర్తి రమేష్, మిట్టపల్లి మహేందర్, వంగల శ్రీధర్‌లతో పాటు న్యూరోసర్జన్ డా రమణారెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంది

-రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్
-ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ

కరీంనగర్, ఏప్రిల్ 7: నిరుపేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు కూడా అండగా నిలుస్తోందని రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ తెలిపారు. మంగళవారం గోదావరిఖని పట్టణంలోని 54 డివిజన్లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి చేపట్టిన భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కాన్సింగ్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతివల్లి ఎల్లయ్య పాల్గొన్నారు. భూమి పూజ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు ఉండాలన్నదే తమ ప్రధాన లక్షణం అన్నారు.

దానిలో భాగంగానే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేరుతో ఇల్లు లేని పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ అదేవిధంగా ఇంటి స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని వారికి ఐదు లక్షల రూపాయలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చేందుకు కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నామని పేర్కొన్నారు.

రామగుండం నియోజకవర్గంలో పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి తాను పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే దిశగా ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్సింగ్ వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు.



గతంలో ఎప్పుడూ లేనివిధంగా నియోజకవర్గం లో వందల కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, పనులు కూడా యుద్ధ ప్రాతిపదికన కొనసాగు తున్నాయని వివరించారు. నియోజకవర్గంలోని ఎవరికి ఏ కష్టం వచ్చినా, తనను స్వయంగా కలవచ్చునని మీ సమస్య పరిష్కారానికి తాను ముందు ఉంటానని ఎమ్మెల్యే మక్కాన్సింగ్ చెప్పారు. డివిజన్ కార్పొరేటర్ ముస్తఫా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కాల్వ లింగస్వామి, దూళికట్ట సతీష్, కొక్కిరాల శ్రీనివాస్ తోపాటు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 5కే రన్ నిర్వహణ

సంగారెడ్డి, ఏప్రిల్ 7(నేటి నిజం ప్రతినిధి ) ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 5కే రన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్ మెడికల్ కాలేజీ నుంచి ఐబీ వరకు కొనసాగింది.




జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు పలు ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానం ద్వారానే వ్యక్తిగతంగా, సామాజికంగా అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సాధారణంగా 40-50 ఏళ్ల తర్వాతే ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతుందని, అయితే ప్రస్తుత యువత ముందుగానే ఆరోగ్యంపై దృష్టి సారించడం శుభపరిణామమని చెప్పారు. భవిష్యత్ తరాల కోసం వైద్యులు సరైన జీవనశైలిపై మార్గదర్శకాలు అందించాలని సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన సమతుల్య ఆహారం, వ్యాయామం, పరిశుభ్రత, మానసిక ప్రశాంతత వంటి అంశాలను యువత పాటించాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి శాస్త్రీయ దృక్పథంతో జీవనశైలిని మార్చుకొని ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. శాస్త్రసమ్మత జీవనశైలిని అనుసరించడం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. రోజువారీ జీవితంలో ఒత్తిడి, చిరాకు వంటి సమస్యలను తగ్గించుకోవాలని సూచించారు. యువత ఆరోగ్య పరంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. ప్రకాష్ రావు, జిల్లా వైద్యాధికారి డా. వసంతరావు, డీఎస్పీ సత్తయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, మెడికల్ విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# నల్లగొండ మెడికల్ కాలేజీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

నల్గొండ, ఏప్రిల్ 7: ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నల్లగొండ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ సూచన మేరకు మంగళవారం ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని కమ్యూనిటీ మెడిసిన్ విభాగ నేతృత్వంలో ప్రపంచ అరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ ఆరోగ్య శిక్షణ కేంద్రంలో పోషకాహారాన్ని పంపిణీ చేశారు. అనంతరం ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన టుగెదర్ ఫర్ హెల్త్-స్టాండ్ విత్ సైన్స్ అనే పిలుపు మేరకు లైన్వాడ హెల్త్ సెంటర్ దగ్గర మెడికల్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అనంతరం మెడికల్ కాలేజీలో పోస్టర్ ఆవిష్కరణ, ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులతో కలిసి వెన్ సైన్స్ స్పీక్స్- షుడ్ వి లిసన్ ఆర్ కోషన్ అనే అంశంపైన డిబేట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్, డాక్టర్ స్వరూప, డాక్టర్ భద్రినారాయణ, డాక్టర్ అనుపమ, కమ్యూనిటీ మెడిసిన్ ఫాకల్టీ, ఇతర వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం వర్క్ షాప్‌లో ఇంటర్ ఏరియా ఫస్ట్ ఎయిడ్ పోటీలు విజయవంతం

ఖమ్మం, ఏప్రిల్ 7:సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలోని ఏరియా వర్క్ షాప్‌లో మంగళవారం ఇంటర్ ఏరియా ఫస్ట్ ఎయిడ్ కాంపిటీషన్ 2025 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్క్ షాప్ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రథమ చికిత్స నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ పోటీలలో ఫస్ట్ ఎయిడ్ హోల్డర్లు, ఉద్యోగులు, సహోద్యోగికి కరెంట్ షాక్ తగిలిన సందర్భంలో ప్రాణాలు ఎలా కాపాడాలో ప్రాక్టికల్ డెమో ద్వారా వివరించారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్ షాక్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్పష్టంగా చూపించారు. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగుల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స అందించే సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు, భద్రతపై అవగాహన మరింత బలపడింది అని కార్మికుల అన్నారు.

ఫస్ట్ ఎయిడ్ కన్వీనర్ సి.ఆర్.బి. ప్రసాదరావు ఆధ్వర్యంలో, కో-కన్వీనర్ డాక్టర్ పి. శేషగిరి రావు, రెస్క్యూ స్టేషన్ హెడ్ ఓవర్ మెన్ బి.నాగేశ్వరరావు, ఏ.ఎస్.ఓలు ముక్కపాటి వెంకటేశ్వ రరావు, ఇల్లెందు ఏరియా ప్రతినిధులు, వర్క్ షాప్ హెచ్.ఓ. డిజె. క్రిస్టఫర్, వైస్ ప్రెసిడెంట్ ఎం.డి.రజాక్, సేఫ్టీ ఆఫీసర్ ఐ.అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఇంజనీర్లు బి.శంకర్, టి.అనిల్, ఏ.ఉపేందర్ బాబు, యూనియన్ ప్రతినిధులు ఎండీ.సత్తార్ పాషా (ఐఎన్టీయూసీ), ఎం. మధు కృష్ణ (ఏఐటీయూసీ), ఫస్ట్ ఎయిడ్ టీం కెప్టెన్ ఎం.అశోక్, సభ్యులు శ్రీకాంత్ శర్మ, బత్తుల శ్రీనివాస్, ఎన్.వెంకటేశ్వరరావు, గరిగ హరీష్, ఫస్ట్ ఎయిడ్ రూమ్ ఇన్‌చార్జి ఎస్.కే.ఖాజా పాషా, మహిళా ఉద్యోగులు, అప్రెంటిస్‌లు, డీఎల్ఆర్ కార్మికులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి : డీఎంహెచ్ఓ తుకారాం రాథోడ్

బూర్గంపహాడ్, ఏప్రిల్ 07 : ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ ఉండాలని, ఆరోగ్యంపై శ్రద్ధ చూపినప్పుడే జీవితం సాఫీగా సాగుతుందని డీఎంహెచ్ఓ తుకారాం రాథోడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్‌లో ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మోరంపల్లిబంజర్ పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కేజీబీవీ పాఠశాల ప్రాంగణం నుండి ప్రారంభమై బస్టాండ్ వరకు కొనసాగింది. అనంతరం కేజీబీవీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బందికి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. ఆరోగ్య ప్రాముఖ్యత కోసం విద్యార్థులు తీసుకోవాల్సిన, పాటించాల్సిన అంశాలను వివరించారు.




తొలుత పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించి ఆశాలు, ఆరోగ్య సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఆశాలు, ఆరోగ్య సిబ్బందికి సమావేశం నిర్వహించి గర్భిణీల నమోదు, అధిక ప్రమాద గర్భధారణల గుర్తింపు, నిర్వహణ ప్రారంభ దశలో ఏఎన్‌సీ నమోదు మెరుగుదలపై అవగాహన కల్పించారు. రోగుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారికి అందుతున్న వైద్యంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీధర్, ఎంపీ బంజర్ వైద్యులు నవీన్, డీపీఎంఓ మోహన్, ఎంపీహెచ్ఐఓ రవి, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశాలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# దాతల సహకారంతో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం ఏర్పాటు

ఖమ్మం, ఏప్రిల్ 7:డల్లాస్ ఎంఎస్ సెరెంగెటీ (టెక్సాస్-యూఎస్ఏ) ఆర్థిక సహకారంతో బూర్గంపహాడ్ మండల పరిధిలోని రాజీవ్‌నగర్ ఆదివాసీ గ్రామంలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ఐసీడీఎస్ సీడీపీఓ రేవతి మంగళవారం ప్రారంభించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఖమ్మంకు చెందిన సామాజిక సేవకురాలు, ఉపాధ్యాయురాలు రూప్లా నాయక్, కొంగర పురుషోత్తమ రావు, రామచంద్రరావు దృష్టికి తీసుకువెళ్లగా వారు స్పందించి యూఎస్ఏలో ఉన్న కుటుంబ సభ్యుల సహకారంతో రూ. 2 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని ఐసీడీఎస్ సీడీపీఓ రేవతి లాంఛనంగా ప్రారంభించి ఐసీడీఎస్ శాఖకు అధికారికంగా అప్పగించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ ఐజీడీ ప్రమీల, సెక్టార్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు, వార్డు సభ్యులు భీమరాజు, భద్రయ్య, దేవయ్య, పాల్గొన్నారు.



# సాహితీవేత్తలకు మార్గదర్శకుడు బంకించంద్రుడు

## ఏప్రిల్ 8...బంకించంద్ర ఛటర్జీ వర్ధంతి

బంకిం చంద్ర చటోపాధ్యాయ పేరు తెలియని భారతీయుడు ఉండడు అంటే అతిశయోక్తి కాదు. వందేమాతరం గీత రచయితగా ఆయన యావత్భారతానికి సుపరిచితులే. ఆయన రచయిత, కవి, పాత్రికేయుడు. ఆయన వందే మాతరం మొదట సంస్కృత స్తోత్రంలో భారత దేశాన్ని మాతృదేవతగా వ్యక్తీకరించారు. ఆ గీతం ద్వారా భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కార్యకర్తలను ప్రేరేపించారు.

బంగ్లా భాషలోని అగ్ర రచయితల్లో ఒకరుగా భావించే బంకిం చంద్ర చటోపాధ్యాయ తన రచనలతో కేవలం బంగాలీ సమాజాన్నే కాదు, మొత్తం దేశాన్నే ప్రభావితం చేశారు. ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో బంకించంద్ర చటర్జీ అగ్రగణ్యులలో ఒకరు..ఒక్క బెంగాలీ సాహిత్యాన్నే కాక సమస్త భారతీయ సాహిత్యాలను ఆయన పంతొమిదో శతాబ్ది ఉత్తరార్ధంలో, ఇరవయ్యో పూర్వార్ధంలో అంటే సుమారు ఒక శతాబ్దం పాటు ప్రభావితం చేసారు. ప్రపంచ సాహిత్య చరిత్రలో జాతుల విముక్తి పోరాటాలలో, స్వాతంత్ర్య సమర చరిత్రలో ఒక మహా కవి రచించిన దేశభక్తి గీతం తన జాతి జనులను ఉత్తేజపరిచి, ఉద్యమింప చేసిన సంఘటన, బంకించంద్రుడి విషయంలో లాగ మరొక దేశంలో, మరొక దేశ చరిత్రలో చోటు చేసు కోలేదనేది వాస్తవం.

బంకిం చంద్ర చేత ప్రచురితమైన ఆయన తొలి రచన బంగ్లా కాదని, ఆంగ్లమని చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. దాని పేరు రాజ్‌మోహన్స్ వైఫ్. ఆయన మొదటి బంగాలీ రచన దుర్గేష్ నందిని.

ఆయన ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా భారత దేశంలో ప్రథమ స్వతంత్ర సంగ్రామం జరిగిన 1857లోనే బీఏ ఉత్తీర్ణులు అయ్యారు. బెంగాల్‌లో మొదటగా బి.ఏ డిగ్రీ పొందిన వ్యక్తి ఈయనే కావడం విశేషం. 1869లో ఆయన లా డిగ్రీ అందుకున్నారు. స్వస్థాన వేష భాషల పట్ల గౌరవాభిమానాలు కలవాడు. ఇరవై ఏళ్ళు నిండకముందే 'లలిత ఓ మానస్' అనే కవితా సంపుటి రచించాడు. దుర్గేశ్ నందిని, కపాల కుండల, మృణాళిని, దేవీ చౌధురాణి మున్నగు 15 నవలలు ఆయన రాశారు.

బంకించంద్ర ఛటర్జీ (27 జూన్, 1838 – 8 ఏప్రిల్, 1894) రచన వందేమాతరం గీతాన్ని ఆనంద్ మఠ్ అనే నవల నుండి సంగ్రహించారు. ఈ గీతం భారత స్వతంత్ర సంగ్రామంలో సమర శంఖంగా పనిచేసింది. దేశమంతటా ప్రతిధ్వనించిన నినాదమయింది.

దేశాన్ని మాతృమూర్తిగా సంబోధిస్తూ, దేశభక్తిని ప్రబోధిస్తూ, 'వందేమాతరం' గీత రచన చేసిన ర తర్వాత దానిని 'ఆనంద్‌మఠ్' నవలలో పొందు పరిచారు. ఈ నవల వివిధ భారతీయ భాషలలో నికి అనువదించ బడడం వలన వందేమాతరం గేయం దేశవ్యాప్తంగా ప్రచారాన్ని పొందింది. ఈ గేయాన్ని బహిరంగంగా గానం చేయటాన్ని నాటి ప్రభుత్వం నిషేధించింది.

**బంకిం చంద్ర చేత ప్రచురితమైన ఆయన తొలి రచన బంగ్లా కాదని, ఆంగ్లమని చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. దాని పేరు రాజ్‌మోహన్స్ వైఫ్. ఆయన మొదటి బంగాలీ రచన దుర్గేష్ నందిని.**

రవీంద్రుడు బాణీకట్టి నిషేధాజ్ఞలను ఉల్లంఘించి 1896 కాంగ్రెస్ సభలలో గానం చేశాడని చెపుతారు.

భారతదేశ స్వాతంత్ర్య ఆకాంక్ష ప్రజల్లో చైతన్య వంతమవుతున్నప్పుడు వందేమాతరం గీతం ఆ చైతన్యాన్ని వేగవంతం చేసింది. సమరోత్సాహాన్ని త్వరితం చేసింది. ఆయన సాహిత్య ప్రతిభ బహు ముఖమైనది. నవలలు, వ్యాసరచన, సాహిత్య విమర్శ, వ్యాఖ్యాన రచనలో బంకించంద్ర చటర్జీ వంగ సాహిత్యంలో కొత్త వరవడి సృష్టించారు. నవలా రచనలో తక్కిన ఆధునిక భారతీయ సాహిత్యాలకు కూడా ఆయనే దారి చూపారు. అంతరాంతరాలలో ఆయనకు పూర్వ భారతీయ సంస్కృతి పట్ల, హిందూ మతాచార విశ్వాసాల పట్ల అభిమానం ఉండేదని సాహిత్యవేత్తల అభిప్రాయం.

మానవుడు చేరుకోగల ఉదాత్త శిఖరాలను బంకించంద్రుడి పాత్రలు అధిరోహిస్తాయి. అనూహ్యమైన, మానవాతీతమైన త్యాగాన్ని ఆయన పాత్రలు ప్రకటిస్తాయి. బంకించంద్రుడిలో మాతృ దేశాభిమానం, దేశ భక్తి అనంతం, అపూర్వం.

ఆనంద మఠంలో ఆయన చిత్రించిన పాత్రలు ఎటువంటి త్యాగానికైన, సాహసానికైన ప్రతీకలుగా ఉన్నాయి. ఆయన చారిత్రిక పాత్రలను, పూర్వ చారిత్రిక వైభవ సన్నివేశాలను, సౌందర్య భావకతను, ఆలంబనం చేసుకొని రచనలు సాగించాడు అని కొందరు సాహితీవేత్తల భావన. ఆయన సృష్టించిన స్త్రీ పాత్రలు సాహసం, నిర్భీకత, ప్రణయోద్వేగం, మానవానుభూతుల మధ్య అవి జీవిస్తాయి.

అటువంటి స్త్రీ పాత్రలు పురుషులకు ఏమాత్రం తీసిపోరు అని వంగ సాహిత్య విశ్లేషకులు, విమర్శకులు, బంకించంద్ర ఛటో పాధ్యాయను ప్రసంసించారు.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

## సింగూరు నీటిని ఘణపూర్ ప్రాజెక్ట్‌కు విడుదల చేయాలి : పద్మా దేవేందర్ రెడ్డి



మెదక్, ఏప్రిల్ 7:యా సంగిలో రైతులు సాగు చేస్తున్న పంటలను కాపాడేందుకు సింగూరు ప్రాజెక్టు నుంచి వెంటనే 0.3 టీఎంసీల నీటిని విడుదల చేయాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి రైతులతో కలిసి ఫిర్యాదు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని మానవ హక్కుల కమిషన్ కార్యాలయం వెళ్లి కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.తెలంగాణ పర్యాటకం ఘణపూర్ ఆయకట్ట కింద రైతులు వేల ఎకరాలలో పంటలు సాగు చేస్తున్నారని, సింగూరు నుంచి నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు సాగు చేస్తున్న పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. రెండు మూడు రోజుల్లో నీటిని విడుదల చేయకపోతే చివరి దశలో ఉన్న పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. పలుమార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. మానవ హక్కుల కమిషన్ జోక్యం చేసుకొని సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేందుకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.సింగూరు నీటిని విడుదల చేయకపోతే రైతులు సాగు చేస్తున్న పంటలు ఎండిపోయి పెట్టిన పెట్టుబడులు రాని పరిస్థితి ఉందన్నారు. రెండు రోజుల్లో నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు

### – భారీ సైక్లింగ్ ర్యాలీ..

కరీంనగర్, ఏప్రిల్ 7:(నేటి నిజం ప్రతినిధి) ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్జిల్లా కేంద్రంలో ఘనంగా హెల్తీ సైక్లింగ్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిన్నార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు "అల్ఫోర్స్" డా. వి. నరేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలాం పాల్గొనడం విశేషం.ఈ సందర్భంగా అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ప్రజలు తమ ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ పెంచుతున్నారని పేర్కొన్నారు. సైక్లింగ్ చేయడం ద్వారా వ్యక్తిగత ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా పర్యావరణ కాలుష్యాన్ని కూడా తగ్గించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో సైక్లింగ్ కీలకంఅభివృద్ధి చెందిన దేశాల్లో సైక్లింగ్‌కు అధిక ప్రాధాన్యత ఉందని, మన దేశంలో కూడా దీనిని అలవాటుగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. సైక్లింగ్ వల్ల శారీరక దృఢత్వం పెరగడంతో పాటు రోజువారీ పనులను సమర్థవంతంగా నిర్వహించవచ్చని చెప్పారు. 150 మంది సైక్లిస్టుల ఉత్సాహభరిత భాగస్వామ్యం కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుండి ప్రారంభమై బస్టాండ్, తెలంగాణ చౌక్, ఆర్ అండ్ బి చౌరస్తా, కోర్ట్ చౌరస్తా మీదుగా రెనీ హాస్పిటల్ వరకు సాగింది. ఈ ర్యాలీలో సుమారు 150 మంది సైక్లిస్టులు పాల్గొన్నా రు. ఈ కార్యక్రమంలో రెనీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డా. బంగారి స్వామి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. కెప్టెన్ బి. మధుసూదన్ రెడ్డి, మహేందర్, ట్రాఫిక్ సిఐ బి. సంజీవ్, ట్రాఫిక్ ఎస్ఐ హనుమంతు తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్న వారందరికీ త్వరలో ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## ఘనంగా చిత్ర కళాకారుడు కాపు రాజయ్య జయంతి వేడుకలు

వేములవాడ, ఏప్రిల్ 07: వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలోమంగళవారం తెలంగాణ గ్రామీణ జీవన చిత్రకళా నైపుణ్యాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన తెలంగాణ చిత్ర కళాకారుడు కాపు రాజయ్య 101వ జయంతిని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కాపు రాజయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలంగాణా గ్రామీణ జీవన చిత్రకళా శైలికి జాతీయ స్థాయిలో వన్నె తెచ్చిన చిత్రకారుడు కాపు రాజయ్య అని కొనియాడారు.

చిన్నప్పటినుండి చిత్రకళ పట్ల మిక్కిలి ఆసక్తి ఉన్న రాజయ్య గవర్నమెంట్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ హైదరాబాద్ నందు డిప్లొమా చేసి ఉపాధ్యా య వృత్తిని చేపట్టాడని, తన కుంచెతో తెలంగాణ గ్రామీణ జీవన విధానాన్ని అద్భుతంగా చిత్రించారని తెలిపారు. ఆయన రూపొందించిన చిత్రాన్ని లండన్ నుండి వెలువడే ఒక పత్రిక ముఖచిత్రంగా ప్రచురించిందని, 1962 సంవత్సరంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కాపు రాజయ్యను ఘనంగా సన్మానించిందని గుర్తు చేశారు.

తెలంగాణా మట్టి వాసనలను తన కుంచె కు అద్దిన రాజయ్య ప్రజా కళాకారుడిగా కీర్తింపబడ్డాడని, ప్రభుత్వ సన్మానాల కంటే ప్రజల అభిమానానికి విలువనిచ్చేవారాయన అని, నిజాం కాలం మొదలుకొని ములుగు పోలీసులు విద్యార్థులపై చేసిన అఘాయిత్యాల వరకు ఎన్నో వాస్తవ సంఘటనలను, గ్రామీణ పేదల జీవన విధానాలను తన కుంచతో మహాదద్భుతంగా చిత్రించారన్నారు.

ఆయన ఎన్ని దేశాలు తిరిగి వచ్చినా, మరెన్నో సన్మానాలు, పురస్కారాలు అందుకున్నా లాల్చీ, పైజామాతో సైకిల్ పై తిరుగుతూ జనంతో మమేకమై సాదాసీదా జీవితాన్నే గడిపాడని, సిద్దిపేటలో ఒక ఆర్ట్ మ్యూజియం స్థాపించారని, ఎందరో విద్యార్థులకు చిత్రకాలలో మెలకువలు నేర్పారని పేర్కొన్నారు.

కడవరకూ గ్రామీణ జీవన విధానానికి కట్టుబడి జీవించారని, అచ్చమైన తెలుగు జానపద సృష్టి కాపు రాజయ్య అని చాటి చెప్పారు.బతుకమ్మ, బోనాలు, ఎల్లమ్మ, జోగి లాంటి అచ్చమైన తెలంగాణ పండగలే కాదు వీధి నాటకం, బుర్రకథ, శారదగాండ్లు లాంటి తెలుగు కళా వారసత్వ సంపదలను భారతీయ కళా సేవకు మొదటగా పరిచయం చేశారని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ దాసరి సుజాత, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

## బంకుల్లో ఆటో ఎల్పీజీ కొరత లేకుండా చూడాలి: కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

హైదరాబాద్, ఏప్రిల్07: ఆటో ఎల్పీజీ తెప్పించి బంకుల్లో ఎక్కడా కొరత లేకుండా చూడా లని కంపెనీలకు తెలంగాణ పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గత వారం రోజులుగా కంపెనీలు మంచి పనితీరు కనబరిచాయని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆటో ఎల్పీజీ సరఫరా చేసే ప్రైవేట్ మార్కెటింగ్ కంపెనీలతో కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వారం రోజుల్లో మొత్తం 363 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీని తెప్పించి సరఫరా చేశారని వివరించారు.

మూతపడిన 17 బంకులను మళ్లీ తెరిపించారని పేర్కొన్నారు. గ్యాస్ సరఫరాను పెంచి, మూతపడిన బంకులను మళ్లీ తెరిపించడంలో సూపర్ గ్యాస్ గో గ్యాస్ టోటల్ ఎనర్జీస్ ప్రైమ్ ఫ్యూయల్ కంపెనీలు చేసిన కృషిని ఈ సందర్భంగా కమిష నర్ అభినందనలు తెలిపారు. పని తీరు ఏ మాత్రం మెరుగు పరుచుకోని పలు కంపెనీల పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆటో ఎల్పీజీని అధికంగా తెప్పించి, బంకులన్నింటిలో సరఫరా చేయాలని కంపెనీలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతిన కుండా ఉండాలంటే ఆటో ఎల్పీజీ సరఫరా ఆగకుండా చూడాలని ఆయిల్ కంపెనీలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆటో గ్యాస్ కొరత రాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టా మన్నారు. బంకులకు గ్యాస్ వస్తున్న లెక్కలను పౌరసరఫరాల శాఖ ప్రతి రోజు పర్యవేక్షిస్తుందని కమిషనర్ స్టీఫెన్ రవీందర్ వెల్లడించారు. ఏదైనా సమస్య ఉంటే హెల్ప్ లైన్ 1967కు ఫోన్ చేయాలని సూచించారు.

## టీయూడబ్ల్యూజే (ఐజేయు) ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా రాపెల్లి శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 7: నేటినిజం ప్రతినిధి): :టీయూడబ్ల్యూజే (ఐజేయు) అనుబంధ వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా రాపెల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మంగళవారం నిర్వహించిన నూతన కార్యవర్గం ఎన్నికల పోలింగులో రాపెల్లి శ్రీనివాస్ 16 ఓట్ల తేడాతో అమరగొండ కిషన్ పై ఘన విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా ఉల్లెందుల మల్లేశం ఆరు ఓట్ల తేడాతో కలీం పాషాపై గెలుపొందారు. కోశాధికారిగా గడీల ప్రవీణ్ కుమార్, సహాయ కార్యదర్శిగా మదాం బాబు గెలుపొందారు. ఇదిలా ఉండగా, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడుగా కంకణాల సాయి శరత్ బాబు, కార్యవర్గ సభ్యులుగా కొక్కుల శ్రీనివాస్, ఎనగందుల నగేష్, ఖాజా నయీముద్దీన్, గొంగళ్ళ రవికుమార్, తూపుకారి శ్రీనివాస్, పోకల ఆంజనేయులు, సయ్యద్ హబీబ్ పాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని గెలుపొందారని ఎన్నికల అధికారి రేగుల దేవేందర్, సహాయ అధికారి పారువెల్ల శ్రీనివాస్ ప్రకటించారు.

## ఉద్యమకారుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

### -కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 7: నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని తెలంగాణ ఉద్యమ కళాకారుల ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఉద్యమ కళాకారుల ఫోరం సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ కళాకారుల పోరం కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కళాతపస్వి యెల్ల పోశెట్టి మాట్లాడుతూరాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ నెల 18వ తేదీన హైదరాబాద్ తార్నాకలోని వేదిక మర్రికృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నారనీ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళాకారులు, ఉద్యమకారులు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సదస్సులో రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి ఉద్యమకారులు, కళాకారులు, కవులు, సాహితీవేత్తలు, గాయకులు, రచయితలు, మహిళా కళాకారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తరఫున జిల్లాల అధ్యక్షులు, కన్వీనర్లు, రాష్ట్ర స్థాయి నాయకులు, కోఆర్డినేటర్లు, మండల, గ్రామ స్థాయి ప్రతినిధులు బాధ్యతలు తీసుకుని సదస్సు విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ కళాకారుల విభాగం కోఆర్డినేటర్ బొడ్డు రాములు, దక్షిణ తెలంగాణ కళాకారుల విభాగం కన్వీనర్ వెన్నమల్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ విద్య సంస్థ లో సీట్ సాధించిన కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులను అభినందించిన స్కూల్ యజమాన్యం

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 7: నేటి నిజం ప్రతినిధి): వేములవాడకిడ్స్ కాన్వెంట్ హై స్కూల్లో నాల్గవ తరగతి చదువుతున్న కొల వర్ణిక కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నవోదయ ఎంట్రన్స్ లో చొప్పదండి నవోదయ లో ఐదవ తరగతికి సీటు సాధించడం జరిగింది. ఈ విద్యార్థిని ని కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ ప్రిన్సిపాల్ ధరక్షన్ వసూపియా బహుమతి ప్రధానం చేసి అభినందించారు. మా స్కూల్ విద్యార్థిని నవోదయలో సీటు సాధించడం మాకెంతో గర్వకారణమని కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ ధరక్షన్ వసూపియా తెలియజేసారు. మా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని విద్యార్థులకు చిన్నప్పటినుండే వారికి కావాల్సిన విద్య నైపుణ్యాలను నేర్పిస్తున్నాము అని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలియజేశారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: BAISA DEVADAS.